# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 8 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 215 | పేజీలు: 8+4 | వెల రూ.5


GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## Ask Me Anything



2

## చంద్రుడిపై కూలిన స్పేస్ఎక్స్ రాకెట్ శకలం



2



# చంద్రన్న చల్లగా ఉండాలి!

## 90 ఏళ్ల వృద్ధురాలు దీవెన ● చేనేత కుటుంబంతో సీఎం చంద్రబాబు ఆత్మీయ కలయిక

అధికార ముద్రలు, ప్రోటోకాల్ ఆర్భాటాల మధ్య ఓ అరుదైన మానవీయ దృశ్యం ఆవిష్కృతమైంది. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి, తొంభై ఏళ్ల వయసు పైబడిన ఒక సామాన్య చేనేత వృద్ధురాలి పక్కన కూర్చుని, ఆమె ముడతలు పడిన చేతులను తన చేతుల్లోకి తీసుకుని పలకరించిన తీరు అక్కడున్నవారి గుండెలను హత్తుకుంది.

■ పి.మీరాహుస్సే ఖాన్

**అమరావతి, (మనం ప్రత్యేక ప్రతినిధి):** శతాబ్దపు అంచుల్లో ఉన్న ఆ పండు ముత్తైదువ కళ్లలో ఆనంద బాష్పాలు రాలాయి. ఆప్యాయంగా సీఎం చంద్రబాబు తలపై చేయి వేసి దీవించిన వైనం ఎవరికైనా గుండెలను కదలించక మానదు. కేవలం ఒక అధికారిక పర్యటనగా కాకుండా, రెండు తరాల మధ్య బంధాన్ని, ఒక పాలకుడికి ప్రజలపై ఉన్న మమకారాన్ని కళ్లకు కట్టింది. చేనేత కుటుంబానికి ఏపీ సీఎం చంద్రబాబు ఆత్మీయ పలకరింపు ఇది. కంటిచూపు మందగించినా, చేనేత మగ్గాల చప్పుడుతోనే జీవితాన్ని గడిపిన ఆ వృద్ధురాలి కష్టాలను చంద్రబాబు నాయుడు ఎంతో ఓపిగ్గా అడిగి తెలుసుకున్నారు. 'మీకు నేనున్నాను' అంటూ ఆమెకు, ఆమె కుటుంబానికి ప్రభుత్వం తరపున పూర్తి సంక్షేమ భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి స్వయంగా తన వద్దకు వచ్చి అంత సమయం కేటాయించడంతో, ఆ వృద్ధురాలు భావోద్వేగానికి లోనవుతూ ఆయన చల్లగా ఉండాలని దీవించారు. తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్ష ను సీఎం చంద్రబాబు నెరవేర్చారు. చీరాలలో సీఎంను కలిసిన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన చేనేత కుటుంబం నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులను సీఎం చంద్రబాబు ఆత్మీయంగా పలకరించారు. తనను కలవాలని ఉందన్న ఆ వృద్ధురాలిని ప్రత్యేకంగా కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక అరుదైన అనుభూతికి లోనయ్యారు. చీరాలకు చెందిన 90 ఏళ్ల పుష్పావతిని పిలిపించుకుని మాట్లాడారు. సామాజిక

...మిగతా 2లో

# ఆగస్టులోనే వెలిగొండకు కృష్ణా జలాలు

## మంత్రి నిమ్మల రామానాయుడు





**విజయవాడ, సెంట్రల్ ఆగస్టు 7:** వెలిగొండ ప్రాజెక్టుకు ఈ ఆగస్టు నెలలోనే కృష్ణా జలాలను తరలించే లక్ష్యంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ పనులు ప్రస్తుతం 90 నుంచి 99 శాతం వరకు పూర్తయ్యాయని వెల్లడించారు. విజయవాడలో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మిగిలిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. టన్నెల్-1, టన్నెల్-2లకు సంబంధించిన సీసీ లైనింగ్ పనులను ఈ నెల 18లోగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. టన్నెల్లో ఉన్న టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషిన్) తొలగింపు పనులు ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను వచ్చే 7 నుంచి 10 రోజుల్లో పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.ఫీడర్ కెనాల్ బలోపేతం పనులు కూడా వేగంగా సాగుతున్నాయని, సీసీ వాల్, లైనింగ్ పనులు గణనీయంగా పూర్తయ్యాయని తెలిపారు. ఈస్టర్న్ మెయిన్ కెనాల్, సుంకేసుల, గొట్టిపడియ రెగ్యులేటర్ల పనులను ఈ నెల 15లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.వెలిగొండ నిర్వాసితులకు ఇప్పటికే రూ.318 కోట్ల పరిహారం చెల్లించినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన 4,761 కుటుంబాలకు రూ.600 కోట్ల పరిహారాన్ని రెండు విడతల్లో అందించనున్నట్లు వెల్లడించారు. సమీక్ష సమావేశంలో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏపీకి 14 కొత్త డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు

## పార్లమెంట్‌లో ఎంపీ చిన్ని ప్రశ్నకు కేంద్రం వెల్లడి



**విజయవాడ తూర్పు ఆగస్టు 7 (మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌కు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 14 కొత్త డే కేర్ క్యాన్సర్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడించారు. లోక్సభలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అడిగిన ప్రశ్నకు ఆయన ఈ వివరాలు వెల్లడించారు.మంత్రి జేపీ నడ్డా సమాధానంలో పేర్కొన్న వివరాల ప్రకారం, 2025-26 కేంద్ర బడ్జెట్లో ప్రకటించిన లక్ష్యానికి అనుగుణంగా మూడు

...మిగతా 2లో




2

## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం సీనియర్ ఐఏఎస్ అధికారుల భారీ బదిలీలు, నియామకాలు చేపట్టింది. పలువురు అధికారులను కీలక శాఖలకు బదిలీ చేస్తూ తక్షణమే అమల్లోకి వచ్చేలా సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.




# అమరావతి పికిల్బాల్ లీగ్కు శ్రీకారం

## క్రీడల అభివృద్ధితో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

## మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ, తూర్పు ఆగస్టు 7( మనం న్యూస్):** రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దడంలో క్రీడలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. విజయవాడలోని నైట్రో పికిల్బాల్ అండ్ కేఫేలో శుక్రవారం నిర్వహించిన అమరావతి పికిల్బాల్ లీగ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్లో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ లీగ్ ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో పికిల్బాల్ క్రీడ విస్తరణకు ఈ టోర్నమెంట్ కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, పికిల్బాల్ వంటి నూతన క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నాయుడు, శాప్ చైర్మన్ రవి నాయుడు, సినీ హీరో సుశాంత్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు.



6

## అమ్మవార్లకు శాకాంబరి అలంకరణ

ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా పెనుగొండలోని శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్దని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి వైభవంగా శాకాంబరి అలంకరణ నిర్వహించారు.

# చేనేత భారతీయ సంస్కృతికి ప్రతీక

## మోదీ నాయకత్వంలో చేనేత రంగానికి స్వర్ణయుగం

## బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం,ఆగస్టు 7(మనం న్యూస్):** ప్రతి ఇంటా స్వదేశీ అనేది కేవలం ఒక నినాదం మాత్రమే కాదని, అది భారతీయుల జీవన విధానం, సంస్కృతి,సంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి ప్రతీక అని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ, భారతీయ చేనేతకు ప్రపంచవ్యాప్తంగా కొత్త గుర్తింపును తీసుకువచ్చిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికే దక్కుతుందని అన్నారు. చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళాత్మకత, స్వదేశీ స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు. వోకల్ ఫర్ లోకల్, ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్

...మిగతా 2లో

# ప్రజల గుండెల్లో పొన్నమండ లక్ష్మణస్వామివర్మ

## అగ్నికుల క్షత్రియుల చరిత్రను చాటిచెప్పిన మహనీయుడు

## ఆయుర్వేదంతో వేలాది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన గొప్పవ్యక్తి

## రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర




**విజయవాడ, ఆగస్టు,07,(మనం ప్రతినిధి):** ప్రజాసేవకు అంకితమైన జీవితంతో సేవా కార్యక్రమాల ద్వారా మన్ననలు పొందిన రాజశ్రీ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అగ్నికుల క్షత్రియ జాతిపిత స్వర్గీయ పొన్నమండ

...మిగతా 2లో



# డీఎస్సీపై వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలి

## స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మిరెడ్డి

**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 7 ( మనం న్యూస్):** రద్దీగా ఉండే బస్టాప్లను ఆక్రమించి రాజకీయ ధర్నాలు నిర్వహించడం వల్ల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డీఎస్సీ అంశంపై అసత్య ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే

...మిగతా 2లో



5

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

# భారతీయులకు మళ్లీ కష్టాలు

## బర్త్‌రైట్ సిటిజన్ షిప్‌పై ట్రంప్ కొత్త ఆదేశాలు




**వాషింగ్టన్, ఆగస్టు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకం చేశారు. విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతః లభించే పౌరసత్వాన్ని పరిమితం చేయడం , బర్త్ టూరిజాన్ని నిషేధించడం ఈ ఉత్తర్వుల ఉద్దేశం. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే వారిని అమెరికన్లుగానే పరిగణించాలని నెల రోజుల క్రితం ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలనే ట్రంప్ ప్రయత్నం అప్పటికి వీగిపోయింది. కానీ, మళ్లీ కొత్త ఉత్తర్వులు ఇచ్చారు. ఇది భారతీయులకు కొత్త కష్టమనే చెప్పాలి. 'జన్మత: పౌరసత్వ హక్కుకు సంబంధించి సుప్రీంకోర్టులో మాకు వ్యతిరేక తీర్పు వచ్చింది. చాలా స్వల్ప తేడాతో వచ్చిన ఆ తీర్పు. చాలా దురదృష్టకరం. ఈ క్రమంలోనే మేం కొన్ని సర్దుబాట్లు చేస్తున్నాం'' అని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే బర్త్ టూరిజాన్ని కూడా నిషేధించాలని అమెరికా

...మిగతా 2లో

## ఇమ్మిగ్రేషన్ దరఖాస్తు అసంపూర్ణంగా ఉంటే తిరస్కరణ

### అధికారులకు విచక్షణాధికారాన్ని పునరుద్ధరించిన అమెరికా


**వాషింగ్టన్, ఆగష్టు 7:** వీసా, గ్రీన్‌కార్డు వంటి ఇమ్మిగ్రేషన్ ప్రయోజనాలు కోరుతూ వచ్చే దరఖాస్తులకు సంబంధించి అమెరికా తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. అర్హతను నిర్ధారించేందుకు అవసరమైన పత్రాలను జోడించని, అసంపూర్ణ దరఖాస్తులను అదనపు వివరాలు కోరకుండానే తిరస్కరించే విచక్షణాధికారాన్ని అధికారులకు పునరుద్ధరించింది. అమెరికా పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్ సేవల సంస్థ (యూఎస్సీఐఎస్) ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. నూతన విధానం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. కొత్తగా వచ్చే దరఖాస్తులతోపాటు

...మిగతా 2లో

# పెరుగుతున్న యువత.. తరుగుతున్న కొలువులు

## ఉపాధి కల్పనకు చర్యలు తక్షణావసరం

## అజీం ప్రేమ్‌జీ వర్సిటీ 'వర్కింగ్ ఇండియా' నివేదిక వెల్లడి




**హైదరాబాద్, ఆగస్టు 7:** దేశంలో కీలకమైన యువ'శక్తి' నిరుద్యోగ సమస్యతో సవాళ్లు ఎదుర్కొంటోంది. చదువుకున్నవారు పెరుగుతున్నా.. ఆ మేరకు ఉపాధి కల్పించడంలో ప్రభావవంతమైన మార్పులేమీ జరగడం లేదు.. పట్టభద్రులవుతున్నవారికి తగిన సంఖ్యలో ఉద్యోగాలు రావడం లేదు. వచ్చిన కొలువులు కూడా శాశ్వత వేతనాలిచ్చేవిగా ఉండటం లేదని అజీమ్ ప్రేమ్‌జీ వర్సిటీ 'కార్మిక బలగంలో యువత' పేరిట నిర్వహించిన 'వర్కింగ్ ఇండియా-2026' అధ్యయన నివేదిక వెల్లడించింది. దేశంలో మధ్య వయస్కులు, ఇతరులతో పోల్చితే యువతలో నిరుద్యోగిత నాలుగు రెట్లు అధికంగా ఉందని.. ఇది ప్రపంచ సగటు కన్నా ఎక్కువని తెలిపింది. నివేదికలోని ముఖ్యాంశాలివి..

- దేశంలో 15-29 ఏళ్లవారు 36.7 కోట్ల మంది. విద్యావంతుల సంఖ్య బాగా పెరుగుతున్న నేపథ్యంలో.. యువతను శ్రామికశక్తిగా మార్చడం కీలకం. సరైన ఆదాయం లభించే అర్థవంతమైన ఉపాధిని కల్పించాల్సి ఉంది. అప్పుడే యువ జనాభా ఆర్థిక ప్రయోజనకారిగా మారుతుంది.
- ప్రస్తుతం జాతీయ సగటు వయసు 29 ఏళ్లు. తెలంగాణలో అది 30 కాగా ఆంధ్రప్రదేశ్‌లో

...మిగతా 2లో

# డీఎస్సీపై వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నాలను విరమించుకోవాలని ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్, టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు పేర్కొన్నారు.


శుక్రవారం అజిత్సింగ్నగర్లోని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ముత్యాలంపాడులో జరిగిన ఘటనపై మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్సీపీ నాయకుడు దేవినేని అవినాష్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు.కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ, డీఎస్సీ పేరుతో రాష్ట్రంలో అశాంతి సృష్టించేందుకు వైఎస్సార్సీపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాప్లను ఆక్రమించి ధర్నాలు నిర్వహించడం ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోందన్నారు. డీఎస్సీ అంశంపై మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్కు సమాధానం చెప్పకుండా రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితమవుతున్నారని విమర్శించారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు ఘటనాస్థలికి ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వెళ్లడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతేనని స్పష్టం చేశారు. వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.

గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ, విజయవాడలో ధర్నా చౌక్ ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా బస్టాప్లను ధర్నాలకు వేదికగా ఎంచుకోవడం సరికాదన్నారు. గత ఐదేళ్లలో ఉద్యోగాల కల్పనలో విఫలమైన వైఎస్సార్సీపీ, ఇప్పుడు మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారాలతో నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పారదర్శక పాలనతో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు.విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సొంత నిధులతో పేదలకు అండగా నిలుస్తూ, పి-4 పథకం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని కొనియాడారు. రాజకీయాల్లో హుందాతనం పాటిస్తూ వ్యక్తిగత విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలపై చర్చించాలని ఇద్దరు నాయకులు పిలుపునిచ్చారు.

# చంద్రన్న చల్లగా ఉండాలి!

(మొదటి పేజీ తరువాయి)

మాధ్యమాల్లో సీఎం చంద్రబాబును కలిసి ఫోటో దిగాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసిన వృద్ధురాలు విషయం తన దృష్టికి రావటంతో చీరాలలో కలిసి మాట్లాడతానంటూ ఎక్స్ వేదికగా సీఎం పోస్ట్ చేసారు. ఈ మేరకు చీరాలలో ఆ వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిచారు. సీఎం చంద్రబాబుతో ఫోటో దిగటంపై అబ్బురపడిన వృద్ధురాలు పుష్పావతి చంద్రబాబును చల్లగా ఉండాలని దీవించారు.మగ్గంతో వస్త్రంపై తన చిత్రపటాన్ని నేసిన చేనేత కుటుంబం నాగేశ్వరరావు, లక్ష్మీలతో మాట్లాడిన సీఎం ఎంతో నైపుణ్యంతో తన చిత్రపటాన్ని వస్త్రంపై నేసిన చేనేత దంపతులకు అభినందనలు తెలియజేశారు.



## భూమ్మీద లేని సరికొత్త వైరస్‌ల సృష్టికి ఏఐ..!

**కాలిఫోర్నియా, ఆగష్టు 7:** కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి వేగంగా విస్తరిస్తోంది. చివరకు ఈ ప్రకృతిలో లేని వైరస్‌లను సృష్టించేందుకు కూడా శాస్త్రవేత్తలు ఏఐని వాడుతున్నారు. ఇందుకోసం స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ఆర్క్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు జనరేటివ్ ఏఐ మోడల్ ఈవోను ఉపయోగించారు. వైరస్ జన్యుక్రమాన్ని కొత్తగా రాసుకున్నారు. తర్వాత ఆ డీఎన్ఏను ల్యాబ్‌లో సింథసైజ్ చేశారు. ఏఐ డిజైన్ చేసిన వైరస్‌లలో 16 పునరుత్పత్తి చెందుతున్నాయని గుర్తించామని చెప్పారు. అవి ఈ-కోలి బ్యాక్టీరియాను చంపుతున్నాయని పేర్కొన్నారు. ఇది సింథటిక్ బయోలజీలో కీలక ముందడుగుగా అభివర్ణించారు. శాస్త్రవేత్తలు గుర్తించిన అంశాలు 'సైన్స్' జర్నల్లో ప్రచురితమయ్యాయి. ఈ వైరస్ బ్యాక్టీరియాకు మాత్రమే సోకుతుందని, మనుషులకు ఎలాంటి హాని కలిగించదని చెప్తున్నారు. ఈవో ఒక లార్జ్ లాంగ్వేజ్ మోడల్. ఇది డీఎన్ఏలోని ప్యాటర్న్‌ను నేర్చుకొని, వాటిని విశ్లేషిస్తుంది. దీనికి లక్షల సంఖ్యలో జీవుల జన్యుక్రమాలపై శిక్షణ ఇచ్చారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

సింథటిక్ బయోలజీ రంగంలో ఇది కీలక విషయమే అయినప్పటికీ.. ఈ సాంకేతికతను మనుషులకు సోకే వైరస్ కోసం ఉపయోగిస్తే ఎలా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. సింథటిక్ బయాలజీ అంటే జీవశాస్త్రానికి ఇంజినీరింగ్‌ను మిళితం చేస్తారు. మానవాళికి ఉపయోగపడేలా కణాలను రీప్రోగ్రామ్ చేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

# ప్రజల గుండెల్లో పొన్నమండ లక్ష్మణస్వామివర్మ

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్మణ స్వామి వర్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, అగ్నికుల క్షత్రియ, బీసీ సంఘాల నాయకులు తదితరులతో కలిసి పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. అగ్నికుల క్షత్రియుల చరిత్రను భావితరాలకు చాటిచెప్పిన మహనీయుడు లక్ష్మణ స్వామి వర్మ అని.. ఆయన ఆయుర్వేదంతో వేలాది మంది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులిచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. నాటి సమాజంలో ప్రజల సమస్యల్ని చూసి.. చలించిపోయి వారికి పొన్నమండ లక్ష్మణస్వామివర్మ అండగా నిలిచారన్నారు.

పేదల కోసం కోరంగిలో ఉచిత వైద్యశాల ఏర్పాటు చేశారని.. అగ్నికుల క్షత్రియుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా పత్రికను నడిపించారన్నారు. అగ్నికుల క్షత్రియులను సమాజంలో చిన్నచూపు చూడటాన్ని సహించలేక చరిత్రను అధ్యయనం చేశారని.. అనేక ప్రాంతాల్లో తిరిగి శోధించి బ్రిటిష్ ప్రభుత్వానికి ఆధారాలు చూపించి అగ్నికుల క్షత్రియులుగా గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఇందుకు అనేక సంవత్సరాల పాటు పోరాడి ప్రత్యేకంగా జీవో వచ్చేలా చేసిన కృషి లక్ష్మణస్వామి వర్మ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అందరి ఆదరాభిమానాలను సొంతం చేసుకున్న పొన్నమండ లక్ష్మణస్వామివర్మ వంటి మహనీయుల అడుగుజాడల్లో నడిచే అవకాశం లభించడం తన అదృష్టమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మహనీయుల త్యాగాలు, సేవలను స్మరించుకోవడంతో పాటు, వారు చూపిన స్ఫూర్తిదాయకమైన మార్గంలో నడవడం ద్వారా సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాం ప్రసాద్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి, బీసీ సంఘ నాయకులు సంగేపు రంగారావు తదితరులతో పాటు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇ.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి 14 కొత్త డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 524 డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు పనిచేస్తుండగా, ఇప్పటివరకు 313 కొత్త కేంద్రాలకు ఆమోదం లభించినట్లు తెలిపారు.ఆంధ్రప్రదేశ్కు 14 కొత్త కేంద్రాలకు ఆమోదం లభించగా, ప్రతి కేంద్రం ఏర్పాటు కోసం రూ.2.40 కోట్లు, రెండో సంవత్సరం నుంచి నిర్వహణ కోసం ఏటా రూ.1.49 కోట్లు కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 23 డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. అంటువ్యాధులు కాని వ్యాధుల నివారణ, నియంత్రణ జాతీయ కార్యక్రమం (ఎన్‌పీ-ఎన్‌సీడీ) కింద రాష్ట్ర ప్రభుత్వాలు అవసరాలను గుర్తించి ప్రతిపాదనలు పంపితే, నిబంధనల మేరకు పరిశీలించి మరిన్ని కేంద్రాలకు కూడా ఆమోదం తెలుపుతామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో డే కేర్ క్యాన్సర్ కేంద్రాల ఏర్పాటు వల్ల క్యాన్సర్ బాధితులకు తమ ప్రాంతానికి సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్లో అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని డే కేర్ క్యాన్సర్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ దృష్టికి నిరంతరం తీసుకెళ్తానని తెలిపారు.

# చేనేత భారతీయ సంస్కృతికి ప్రతీక

(మొదటి పేజీ తరువాయి)

ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్, ఇండియా హ్యాండ్లూమ్ బ్రాండ్, ఈ-కామర్స్ వేదికల ద్వారా చేనేత ఉత్పత్తుల విక్రయాలకు ప్రోత్సాహం, నేతన్నలకు నేరుగా మార్కెట్ అవకాశాల కల్పన, నూలు కొనుగోలుపై సబ్సిడీలు, ఆధునిక డిజైన్లు, నైపుణ్య శిక్షణ, ముద్ర రుణాలు, సామాజిక భద్రతా పథకాలు వంటి చర్యలతో చేనేత రంగం బలోపేతమైందన్నారు. చేనేత వస్త్రాల వినియోగం వల్ల దేశీయ పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పాటు లక్షలాది నేతన్న కుటుంబాలకు ఉపాధి, ఆదాయం లభిస్తోందన్నారు.

స్వదేశీ ఉత్పత్తులను ఆదరించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుందని తెలిపారు. ప్రతి భారతీయుడు కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేసి వినియోగించాలని, అదే నేతన్నల శ్రమకు నిజమైన గౌరవమని అన్నారు.

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా వికసిత్ భారత్ - 2047 లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి శ్రమ, నైపుణ్యం, కళాత్మకత భారతదేశ గర్వకారణమనిబిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి కొనియాడారు.

# భారీగా ఐఏఎస్ ల బదిలీలు

**అమరావతి, మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం సీనియర్ ఐఏఎస్ అధికారుల భారీ బదిలీలు, నియామకాలు చేపట్టింది. పలువురు అధికారులను కీలక శాఖలకు బదిలీ చేస్తూ తక్షణమే అమల్లోకి వచ్చేలా సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పలు కీలక పోస్టులకు ఫుల్ అడిషనల్ ఛార్జ్ బాధ్యతలు కూడా అప్పగించింది. షంషేర్ సింగ్ రావత్ ను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (పర్యాటక సాంస్కృతిక శాఖ)గా నియమించారు. అదనంగా యూత్ సర్వీసెస్ స్పోర్ట్స్, సర్వీసెస్ హెచ్ఆర్ఎం, జీపీఎం ఏఆర్ శాఖల బాధ్యతలు కూడా అప్పగించారు. జె. శ్యామలరావును ప్రిన్సిపల్ సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖగా నియమించారు. అదనంగా ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, రాజకీయ శాఖ బాధ్యతలు నిర్వహించనున్నారు. కోన శశిధర్ ను రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. అదనంగా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ శాఖ బాధ్యతలు కూడా అప్పగించారు.




అమ్రపాలి కాటాను ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపిటిడిసి) మేనేజింగ్ డైరెక్టర్ పదవి నుంచి తప్పించి, తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. పట్టన్శెట్టి రవి సుబాష్ ను ఏపిటిడిసి మేనేజింగ్ డైరెక్టర్ గా నియమించారు. అలాగే ఏపీ టూరిజం అథారిటీ సీఈఓ, ఏపీపీఎస్సీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు కొనసాగిస్తారు. ఎస్. సురేష్ కుమార్ ను రానున్న గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారిగా నియమించారు. డాక్టర్ నారాయణ భరత్ గుప్తాను గోదావరి పుష్కరాల సంయుక్త ప్రత్యేక అధికారిగా నియమించారు. ముత్యాలరాజు రేవును పురావస్తు ,మ్యూజియంల కమిషనర్ గా నియమించారు. కేవీఎన్ చక్రధర బాబుకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ గా అదనపు బాధ్యతలు అప్పగించారు. హెఫ్సిబా రాణి కొర్లపాటిను హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. పి. అరుణ్ బాబును డైరెక్టర్ జనరల్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ గా నియమించారు. ప్రఖర్ జైన్ను విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (వి.ఎం.ఆర్.డి.ఏ) మెట్రోపాలిటన్ కమిషనర్ గా నియమించారు.

గీతాంజలి శర్మకు ఆర్టీజీఎస్ సీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేతన్ టి.ఎస్.₹కు డైరెక్టర్, డిజాస్టర్ మేనేజ్మెంట్ అదనపు బాధ్యతలు ఇచ్చారు.డాక్టర్ ఏ. శరత్ (రిటైర్డ్)ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా నియమించారు.ప్రభల గోపీనాథ్ను ₹₹టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (హెల్త్ ఎడ్యుకేషన్)₹గా నియమించారు. ఏ.ఏ.ఎల్. పద్మావతిను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సీఈఓగా నియమించారు. ఎం. జయకృష్ణను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్గా నియమించారు. బి. సునీల్ కుమార్ రెడ్డి (ఐఎఫ్ఎస్)₹కు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బి. అనిల్ కుమార్ రెడ్డి, ఎన్. తేజ్ భరత్లను తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీకి రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ భారీ పరిపాలనా మార్పులతో ప్రభుత్వ కార్యక్రమాల అమలు మరింత వేగవంతం కావడంతో పాటు శాఖల మధ్య సమన్వయం మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఇమ్మిగ్రేషన్ దరఖాస్తు అసంపూర్ణంగా ఉంటే తిరస్కరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నవాటికీ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాత విధానం ప్రకారం- ఇమ్మిగ్రేషన్ స్టేటస్ మార్పు, పొడిగింపు, గ్రీన్ కార్డులు, వీసా వంటి ప్రయోజనాల కోసం వచ్చే దరఖాస్తులు అసంపూర్తిగా ఉన్నా అవసరమైన పత్రాలు వాటిలో లేకపోయినా.. చాలా సందర్భాల్లో దరఖాస్తుదారులకు యూఎస్సీఐఎస్ అధికారులు 'రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్ఎఫ్ఈ)' లేదా 'నోటీస్ ఆఫ్ ఇంటెంట్ టు డినై (ఎన్వోఐడీ)' నోటీసులు జారీ చేసేవారు.

# స్కూల్లో విద్యార్థి కాల్పులు.. ఏడుగురి మృతి

**బ్యాంకాక్, ఆగష్టు 7:** థాయ్‌లాండ్‌లోని ఓ స్కూల్లో కాల్పులు కలకలం సృష్టించాయి. నొంతగురి ప్రావిన్స్ బాంగ్ క్రువాయ్ జిల్లాలోని డెబ్సిరిన్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు టీచర్లు, ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. కాల్పులు జరిపిన విద్యార్థి కూడా తనను తాను కాల్చుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై థాయ్ ఉప ప్రధాని అనుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని.. స్కూల్‌పై దాడికి గల కారణాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.



**ఇంట్లోవారిని హత్య చేసి..**

కాల్పులకు పాల్పడ్డ విద్యార్థి స్కూల్‌కు వెళ్లడానికి ముందు ఇంట్లో తన బామ్మ, తాతలను కూడా కాల్చి చంపినట్లు థాయ్‌లాండ్ ప్రజారోగ్య మంత్రి తెలిపారు. కాల్పులకు ఉపయోగించిన 9 ఎంఎం హ్యాండ్‌గన్ అతడి తాతకు చెందినదిగా గుర్తించామన్నారు. విద్యార్థి తాత కూడా గతంలో ఉపాధ్యాయుడిగా పని చేసినట్లు తెలిపారు.

# Ask Me Anything

## జెన్ జీ కోసం రాహుల్ గాంధీ కొత్త

**ఢిల్లీ, ఆగష్టు 7:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశంలోని విద్యార్థులు మరియు జెన్ జీ యువత కోసం ఇన్‌స్టా గ్రామ్ వేదికగా 'అటఋ ఖ అ్టడజీఒ్జిజ అనే సరికొత్త ప్రోగ్రామ్ను ప్రారంభించారు. ఈ లైవ్ సెషన్లో దేశవ్యాప్తంగా ఉన్న విద్యా వ్యవస్థ లోపాలు, నిరుద్యోగం, జార్ఖండ్ సహా పలు ప్రాంతాల్లో జరుగుతున్న విద్యార్థుల నిరసనలపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# భారతీయులకు మళ్లీ కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం కోరుకుంటోంది. ''బర్త్ టూరిజాన్ని భారీ సంఖ్యలో విదేశీయులు ఉపయోగించుకుంటున్నారు. పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని పొందుతున్నారు. దానిని అపహాస్యం చేస్తున్నారు. అదంతా అవమానకరం. అలా జరగనివ్వం'' అని వ్యాఖ్యానించారు. బర్త్ టూరిజం పుట్టబోయే బిడ్డకు విదేశీ పౌరసత్వం పొందాలనే లక్ష్యంతో నెలలు నిండే సమయంలో గర్భిణీలు వేరే దేశానికి ప్రయాణించి అక్కడ ప్రసవిస్తారు. ఆ దేశపు చట్టాల ప్రకారం అక్కడ పుట్టిన పిల్లలకు దానంతట అదే పౌరసత్వం లభిస్తుంది.

**చట్టాలు ఏం చెప్తున్నాయి..**

1868లో ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం..అమెరికాలో పుట్టేవారందరికీ (వారి తల్లిదండ్రులు ఆ దేశంలో అక్రమంగా లేదా తాత్కాలికంగా ఉంటున్నా సరే) ఆ దేశ పౌరసత్వం లభిస్తుంది.

విదేశీ దౌత్యవేత్తలు, విదేశాలకు చెందిన దురాక్రమణదారులకు జన్మించే పిల్లలకు మాత్రమే ఇందులో మినహాయింపు ఉంటుంది. జన్మతః పౌరసత్వం లభించడంపై పరిమితులు అమల్లోకి వస్తే ఏటా అమెరికాలో దాదాపు 2.5 లక్షల మంది పిల్లలపై వాటి ప్రభావం ఉంటుంది.

# చంద్రుడిపై కూలిన స్పేస్‌ఎక్స్ రాకెట్ శకలం

## దృశ్యాలను రికార్డు చేసిన కొరియా శాటిలైట్

**వాషింగ్టన్, ఆగష్టు 7:** స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ శకలం ఒకటి చంద్రుడి ఉపరితలంపై క్రాష్ అయింది. ఆ శకలం చంద్రుడిని ఢీకొట్టడానికి ముందు, తర్వాతి దృశ్యాలను దక్షిణ కొరియా శాటిలైట్ చిత్రీకరించింది.ఫాల్కన్ 9 శకలం ప్రమాదవశాత్తూ చంద్రుడిని ఢీకొట్టిన సమయంలో కొరియాకు చెందిన దనూరి స్పేస్ క్రాఫ్ట్ ప్రభావిత ప్రాంతం మీదుగా ప్రయాణించింది. చంద్రుడి కక్ష్య నుంచి ఫొటోలు తీసింది. దక్షిణకొరియా అంతరిక్ష సంస్థ తాజాగా ఆ ఫొటోలను విడుదల చేసింది. ఆ శకలం ఢీకొట్టినప్పుడు ఒక గొయ్యి ఏర్పడింది.



దుమ్ము, రాళ్లను వెదజల్లింది. క్రాష్‌కు ముందు చిత్రాలతో పోల్చిప్పుడు ఆ ప్రాంతం నల్లగా కనిపిస్తోంది. దక్షిణ కొరియా తొలి మూన్ మిషన్ 'దనూరి'ని 2022 ఆగస్టులో ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ రాకెట్ నుంచే లాంచ్ చేశారు.

**స్పేస్ వాక్ చేసిన నాసా వ్యోమగాములు..**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వెలువల నాసా వ్యోమగాములు అనిల్ మేనన్ (భారత సంతతి), జెస్సికా మీర్ స్పేస్ వాక్ చేశారు. పవర్ ఛానల్ కోసం ఒక మాడిఫికేషన్ కిట్‌ను అమర్చేందుకు ఈ వాక్ చేశారు. మేనన్‌కు ఇది తొలి స్పేస్ వాక్.

రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కో స్మోస్‌కు చెందిన సోయుజ్ ఎంఎస్-29 వ్యోమనౌకలో ఇద్దరు రష్యన్ వ్యోమగాములతో కలిసి అనిల్ మేనన్ ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. ఈ బృందం ఎనిమిది నెలల పాటు అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు నిర్వహించి, 2027 ఏప్రిల్లో భూమికి తిరిగి రానుంది.

# పెరుగుతున్న యువత.. తరుగుతున్న కొలువులు

(మొదటి పేజీ తరువాయి)

◆ 34. దేశంలో 2030 తర్వాత పనిచేసే యువ జనాభా తగ్గడం మొదలవుతుంది. యువ జనాభాతో ఆర్థికాభివద్ధి సాధించాలంటే రానున్న పదేళ్లలో భారీగా ఉద్యోగాలు కల్పించాలి.

◆ 2007-2017 మధ్య అత్యంత పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల వాటా ఉన్నతవిద్యలో 8 శాతం నుంచి 15 శాతానికి పెరిగింది. అయితే చాలామంది యువకులు కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు ఉన్నత చదువులు మధ్యలో నిలిపివేస్తున్నారు. 2017లో చదువుకుంటున్న యువకుల వాటా 38 శాతం ఉంటే.. 2024 నాటికి అది 34 శాతానికి తగ్గింది.

◆ యువతకు విద్యాసంస్థల లభ్యత పెరిగినప్పటికీ.. ప్రైవేటు సంస్థలదే అధికవాటా ఉండటంతో ప్రాంతీయ వ్యత్యాసాలు పెరుగుతున్నాయి. చదువుకున్న యువతకు ఎంట్రీ లెవల్ ఉద్యోగాల సంఖ్య తగ్గింది. ఈ స్థాయి ఉద్యోగాల్లో వేతన పెరుగుదల కూడా స్వల్పంగానే ఉంది.

**ఉద్యోగమే కఠిన పరీక్ష..**

యువతకు డిగ్రీ పూర్తిచేయడం ఒకెత్తు అయితే.. ఉద్యోగం సంపాదించడం కఠిన పరీక్షగా మారుతోంది. కోరుకున్న ఉద్యోగం రాకపోవడం, నిరుద్యోగిగా ఉండటం ఇష్టం లేక చాలీచాలని సంపాదనతో ఏదో ఒక రంగాన్ని ఎంపిక చేసుకుని చాలామంది సర్దుబాటు చేసుకుంటున్నారు.

15-25 ఏళ్ల వయసులో నిరుద్యోగం 40 శాతం ఉంటే.. 25-29 ఏళ్లవారిలో ఇది 20 శాతంగా ఉంది. డిగ్రీ పూర్తయిన ఏడాదిలో 50 శాతం మందే ఏడాదిలోగా ఏదో ఒక ఉపాధి పొందుతున్నారు. అయితే శాశ్వత వేతనం, వైట్‌కాలర్ ఉద్యోగాల్లో వీరి సంఖ్య తక్కువే. పట్టభద్రుల్లో 6.7 శాతమే పర్మినెంట్ వేతన.. 3.7 శాతం మంది వైట్‌కాలర్ ఉద్యోగాలు పొందుతున్నారు. 2004 నుంచి 2023 వరకు ఏటా దాదాపు 50 లక్షల మంది పట్టభద్రులు పెరుగుతుంటే.. వీరిలో 28 లక్షల మందికి మాత్రమే ఉపాధి లభిస్తోంది. వీరిలోనూ 17 లక్షల మంది మాత్రమే రెగ్యులర్ వేతన కార్మికులుగా మారుతున్నారు. 1983తో (13%) పోల్చితే ప్రస్తుతం యువ పట్టభద్రుల్లో నిరుద్యోగ వాటా 67 శాతానికి పెరిగింది.

**సవాల్‌గా మారుతున్న ఏఐ..**

యువతకు కృత్రిమ మేధ(ఏఐ) సవాల్‌గా నిలిచింది. ప్రారంభ ఉద్యోగాలు తగ్గిపోయాయి. గత ఐదేళ్లలో తగిన సంఖ్యలో రెగ్యులర్ వేతన ఉద్యోగాల ఉత్పత్తి జరగలేదు. కరోనా తర్వాత దేశంలో ఉద్యోగార్థుల సంఖ్య 49 కోట్ల నుంచి 57.2 కోట్లకు పెరిగింది. దేశంలో అసమానమైన ఆర్థికాభివద్ధి కారణంగా ఉపాధి పొందేందుకు యువతకు వలస వెళ్లడం ప్రధాన మార్గంగా మారుతోంది.

చదువుకున్న యువ కార్మికులు వేగంగా వ్యవసాయాన్ని వదిలిపెట్టి తయారీ, సేవా రంగాల్లోకి వస్తున్నారు. యువ మహిళలు తయారీ, ఐటీ, ఆటోమొబైల్, బిజినెస్, సపోర్ట్ సర్వీసెస్ వంటి ఆధునిక సేవల రంగాల్లో పెరుగుతున్న ఉపాధి పొందుతున్నారు. గతంలో చదువుకున్న మహిళల్లో 45.8 శాతం మంది టీచర్ ఉద్యోగాలకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ వాటా 23.1 శాతానికి పడిపోయింది. తెలంగాణలో పట్టభద్రులైన మహిళల్లో నిరుద్యోగుల వాటా 52%.. పురుషుల్లో అది 28 శాతం.

# యాక్సిడెంట్ చేసి చంపెయ్.. లేకపోతే నేను భస్త

- మొగుణ్ని చంపమంటూ ప్రియుడికి మెసేజ్
- బయటపడ్డ భార్య చాటింగ్.. మెసేజ్‌లు చూసి భర్త షాక్.. పోలీసులకు ఫిర్యాదు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** కట్టుకున్న భర్త హత్యకు అత్యంత దారుణంగా ప్లాన్ చేసిన భార్య ఉదంతం యావత్ లోకాన్ని షాక్ గురి చే(సింది)స్తోంది. గత కొంత కాలంగా అక్రమ సంబధాలు ముసుగులో కట్టుకున్న వాడినే కడతేర్చుతున్న ఘటనలు ఇటీవల బాగా పేరిగాయి. తాజాగా తెలంగాణలో షేక్ చేస్తున్న ఈ ఘటన భర్త అప్రమత్తతే అతని ప్రాణాలు నలిబెట్టింది. తన భార్య మొబైల్‌లో కనిపించిన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ మెస్సేజ్‌లు చూసిన తర్వాత తనను హత్య చేయించే కుట్ర నడుస్తోందని అనుమానించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన గాదె రాజేశ్వరరావు ప్రస్తుతం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. 2016లో సూర్యాపేట జిల్లా రాఘవాపురానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అతను అందించిన చాటింగ్ వివరాల ఆధారంగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గత నెల 27న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్లిన సమయంలో భార్య మరో వ్యక్తితో చనువుగా ఉండటాన్ని గమనించినట్లు రాజేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

దీనిపై పెద్దల సమక్షంలో మాట్లాడాలని నిర్ణయించి మరుసటి రోజు తన అన్నను తీసుకొచ్చేందుకు వెళ్లాడు. భార్యతో కనిపించిన వ్యక్తి ఆ సమయంలో తనను వెంబడించినట్లు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేయగా అతను తప్పించుకుని వెళ్లిపోయాడని తెలిపాడు. అనుమానం మరింత పెరగడంతో భార్య మొబైల్‌ను పరిశీలించానని, అందులో ఉన్న చాటింగ్ చూసి షాక్‌కు గురయ్యానని రాజేశ్వరరావు చెప్పాడు. ఇంట్లో చంపొద్దని, బయట యాక్సిడెంగ్‌గా కనిపించేలా హత్య చేయాలని భార్య, ఆమెకు పరిచయం ఉన్న పురిమెట్ల సైదులుకు పలుమార్లు మెసేజ్‌లు పంపినట్లు ఆరోపించాడు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో జరిగిన సంభాషణల స్క్రీన్ షాట్‌లను కూడా పోలీసులకు సమర్పించాడు. భార్య, ఆమెతో సన్నిహితంగా ఉన్న వ్యక్తి కలిసి తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ ఈ నెల 1న డోర్నకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. తాజాగా బాధితుడు ఖమ్మం రూరల్ పోలీసులను మరోసారి కలిసి పూర్తి వివరాలు అందించాడు. ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.

# ఆడి కృత్తిక వేళ ఆనందగిరి, పద్మగిరి క్షేత్రాలకు పట్టువస్త్రాల సమర్పణ

- చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు
- రెండు ఆలయాల్లోనూ ఘన స్వాగతం.. ఆలయ మర్యాదలతో సత్కారం



**తిరుపతి రూరల్ ఆగస్టు 7 మనం న్యూస్ :** ఆడి కృత్తిక మహోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఆనందగిరి, పద్మగిరి క్షేత్రాల్లో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రతి ఏడాది తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఈ రెండు క్షేత్రాలకు సారె సమర్పించడం చెవిరెడ్డి కుటుంబం ఆనవాయితీగా కొనసాగిస్తోంది. మొదటగా పాకాల మండలం ఊట్లవారిపల్లి వద్దనున్న ఆనందగిరి క్షేత్రంలో శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, అనంతరం తిరుపతి రూరల్ మండలం తణపల్లి సమీపంలోని పద్మగిరి కొండపై వెలసిన శ్రీ దండాయుధపాణి స్వామివారికి కూడా పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు తల్లి చెవిరెడ్డి లక్ష్మీ, సోదరుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు. ఆ రెండు ఆలయాల్లోనూ దేవస్థాన అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సంప్రదాయాల ప్రకారం చెవిరెడ్డి కుటుంబానికి పూర్ణకుంభ స్వాగతం పలికి, వేదమంత్రాల నడుమ స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్

- ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్



**పాకాల ఆగస్టు 7మనం న్యూస్:** పాకాల మండలం ఊట్లవారిపల్లి గ్రామంలోని ఆనందగిరిపై కొలువై ఉన్న శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారిని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ గురువారం రాత్రి దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బారాయుడు, చంద్రగిరి శాసనసభ్యులు శ్రీ పులివర్తి నానితో కలిసి ఆలయానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, శాసనసభ్యులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు నిర్వహించి, భక్తుల సంక్షేమం, జిల్లా ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సమృద్ధులు కలగాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆనందగిరిపై వెలసిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయం ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన క్షేత్రమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం, విద్యుత్, రహదారి సౌకర్యాలు, పార్కింగ్, భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన వసతులు తదితర అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

# ఎస్.సి. బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ కి చర్యలు తీసుకోవాలి

- తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖపై సమీక్ష నిర్వహించిన జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా



**తిరుపతి, ఆగస్టు 7 మనం న్యూస్:** తిరుపతి జిల్లాలో షెడ్యూల్ కులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా తెలిపారు.

శుక్రవారం మద్యాహ్నం స్థానిక శ్రీ పద్మావతి అతిథి గృహంలో భారత జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా, తిరుపతి ఎం.పి. గురుమూర్తి , జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సెక్రటరీ శ్రీనివాస్, డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, రీసర్చ్ అధికారి వర ప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బారాయుడు లతో కలసి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా మాట్లాడుతూ.... జిల్లాలో షెడ్యూల్ కులాల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఎస్సీ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడంతో పాటు, వారి విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వసతి గృహాల్లో అవసరమైన మరమ్మత్తులు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్.సి. బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలా సహకారం

- జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు




నారాయణవనం, ఆగస్టు 7 మనం న్యూస్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా నారాయణవనంలో శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు శాసనసభ్యులు ఆదిమూలం, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, చేనేత శాఖ అధికారులు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత రంగ ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేనేత కార్మికులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, వారి సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సత్యవేడు శాసనసభ్యులు శ్రీ ఆదిమూలం మాట్లాడుతూ, చేనేత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. తరతరాలుగా చేనేత వృత్తిని కొనసాగిస్తూ భారతీయ సంప్రదాయాలను కాపాడుతున్న చేనేత కార్మికుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

# పూతలపట్టులో వైసిపి పార్టీకి ఎదురు లేదు..!

- రాష్ట్రంలో మెగా డీఎస్సీ నియామకాల అక్రమాలపై విచారణ చేపట్టాలి..!
- రాష్ట్ర వైసిపిమేధావుల సంఘ ఐక్యవేదిక కార్యదర్శి పూతలపట్టు జగదీశ్వర్ రెడ్డి..!



**పూతలపట్టు ఆగస్టు 7 మనం న్యూస్:** పూతలపట్టు నియోజకవర్గం లో వైసీపీ పార్టీ ఎదురులేని శక్తిగా ఎదుగుతుందని రాష్ట్ర వైసీపీ మేధావుల సంఘ ఐక్యవేదిక కార్యదర్శి పూతలపట్టు జగదీశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. వైసిపి ఆంధ్ర రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెగా డీఎస్సీ అక్రమాలపై రిలే నిరాహార దీక్ష చేపట్టాలని ఆదేశాల జారి చేయడంతో అందులో భాగంగా శుక్రవారం యాదమరి మండల కేంద్రంలో మెగా డిఎస్సి అక్రమాలపై చేపడుతున్న రిలే నిరాహార దీక్ష చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం పూతలపట్టులో రాష్ట్ర మేధావుల సంఘ ఐక్యవేదిక కార్యదర్శి పూతలపట్టు జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ అక్రమాలకు నిరసనగా వైసిపి పార్టీ చేపట్టిన ఏపీ-జన్ -జెడ్ , రిలే నిరాహార దీక్ష పూతలపట్టు నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష యాదవరి మండల కేంద్రంలో జరిగిందన్నారు. అందులో భాగంగా పూతలపట్టునుండి వైసిపి పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారుఆయన తెలియజేశారు. అనంతరం తన తో కలిసి యాదమరి మండల కేంద్రంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. అనంతరం.

వైసీపీ రాయలసీమ కోఆర్డినేటర్, మాజీ మంత్రివర్యులు

పుంగనూరు శాసన సభ్యులు మన పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా వై,యస్సా,ర్సీ,పి,అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి , నియోజకవర్గ ఇన్చార్జి సునీల్ కుమార్ తో కలిసి రిలే దీక్షలో జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పూతలపట్టు వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. పూతలపట్టునుంచి వైసిపి రాష్ట్ర మేధావుల ఐక్యవేదిక సంఘ కార్యదర్శి పూతలపట్టు జగదీశ్వర్ రెడ్డితో పూతలపట్టు నుండి కార్యకర్తలు నాయకులు గ్రామ పంచాయతీ మండల గ్రామ కమిటీ మెంబర్ లు యువత అనుబంధ విభాగాల నాయకులు అధిక సంఖ్యలో ఆయనతోపాటు వెళ్లారు.

# రైతులు చిరుధాన్యాలు పండించాలి



**తిరుపతి ఆగస్టు7మనం న్యూస్:** తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి డివిజన్, ఏర్పేడు మండల పరిధిలోని దుగ్గిపేరి రెవెన్యూ పరిధిలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎల్ నినో - ప్రభావం.

నివారణ ప్రణాళిక కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద రావు , డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ షణ్ముగం, జిల్లా వ్యవసాయ కార్యాలయం నుండి, ఎడిఎ ధనుంజయ రెడ్డి శ్రీకాళహస్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్)పి.రమేష్ రెడ్డితో కలిసి హాజరవటం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రాబోయే రోజులలో రైతులు ఎల్ నినో ప్రభావాన్ని ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయంపై సమగ్రంగా రైతులకు తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా రైతులు పి.ఎం.డీ.ఎస్. పద్ధతి ద్వారా వివిధ రకాల విత్తనాలను ఎలా ఫెలిటైజేషన్ చేసుకోవాలో ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో రైతులకు చూపించారు. దీనిద్వారా భూమిని పచ్చదనంతో కప్పి ఉంచబడటం వలన ఎండ తీవ్రత నుండి భూతాపాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. రైతులు కూడా కొంతవరకు ఆదాయాన్ని పొందవచ్చునని, అలాగే పశువులకు మేత కూడా పొందవచ్చునని వివరించారు.

గడిచిన మే, జూన్, జూలై మాసాలలో సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షపాతం నమోదు అయినదని, తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి ఎద్దడి నెలకొని ఉందని , వీటితోపాటు ఎండ తీవ్రత, గాలి వేగం అధికంగా ఉండుట చేత వరి పంట పొలాలు ఎండు ముఖం పట్టాయని తెలిపారు. ప్రస్తుతం పిలక దశలో ఉన్న పంట కన్నా కోత దశలో ఉన్న పైరుకు మొదటి ప్రాధాన్యతగా సరైన నీటి తడులను అందించి పంట దిగుబడిని కాపాడుకోవాలని సూచించారు.

# 125 రోజుల వేతన ఉపాధి హామీ కచ్చితంగా అమలు చేయాలి

డ్వామా పిడి రవికుమార్

**చిత్తూరు ఆగస్టు7 మనం న్యూస్:** వికసిత్ భారత్- జి రామ్ జి చట్టం ద్వారా ప్రతి గ్రామీణ కుటుంబాలకు ప్రతి ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వేతన ఉపాధి హామీ కచ్చితంగా అమలు చేయడం జరుగుతుంది డ్వామా పిడి రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక



కలెక్టరేట్లోని డ్వామా కార్యాలయంలోని సమావేశ మందిరములో పంచ సమ్మేళనంలో భాగంగా, జిల్లాలోని ప్రజాప్రతినిధులకు విబి-జిరామ్ జి పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలు సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు అన్ని శాఖలు కలిసి పనిచేయాలి,విబి-జి రామ్ జి పథకంపై గ్రామసభ సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకొని సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుంది, గ్రామానికి ఉపయోగపడే చెరువులు రహదారులు పంట కాలవలు, వర్షపు నీటి సంరక్షణ, పాఠశాలలు, అంగనవాడి కేంద్రాలు, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడము పై పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సామాజిక తనిఖీ ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యం సమర్థవంతమైన పాలనను నిర్ధారించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసిలు, ఎంపీపీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహణ

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి




**చిత్తూరు ఆగస్టు, 7 మనం న్యూస్:** ఆదివాసీలు దేశానికి మూలవాసులని, వారి హక్కులు, భూములు, జీవన విధానాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి పేర్కొన్నారు.

చిత్తూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుడిపాల మండలం కనకనేరు ఎస్.టి. కాలనీ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చిత్తూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎం.ఎస్. భారతి పాల్గొన్నారు. ఆదివాసీల హక్కులు, అటవీ హక్కుల చట్టం , పోక్సో చట్టం , బాల్య వివాహాల నిషేధ చట్టం, విద్యా హక్కు చట్టం, మాదక ద్రవ్యాల నివారణకు సంబంధించిన చట్టాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఆరోగ్యం, న్యాయ సేవలను సద్వినియోగం చేసుకుని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండకముందు వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. బాల్య వివాహాలు జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.


# అగ్నికుల వీర సంప్రదాయానికి వారసుడు పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ

డిఆర్ఓ కె. మోహన్ కుమార్



**చిత్తూరు ఆగస్టు,7 మనం న్యూస్:** అగ్నికులక్షత్రియ సామాజిక వర్గం అభివృద్ధికి పొన్నమండ లక్ష్మణ స్వామి విశేష కృషి చేశారు అని జిల్లా డిఆర్ఓ ఓ. మోహన్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి మహోత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూఅగ్నికుల వీర సంప్రదాయానికి వారసుడు పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ అని తెలిపారు,తన సామాజిక వర్గంతో పాటు పేదల అభ్యున్నతికి విశేష కృషిన సమాజ సంస్కర్త అని కొనియాడారు. 1890లో కాకినాడ సమీపంలోని కోరంగి గ్రామంలో అగ్నికుల క్షత్రియుల ప్రప్రథమ రాష్ట్రస్థాయి మహాసభను నిర్వహించి, ఆ సామాజిక వర్గీయులను ఒకతాటిపైకి తీసుకొచ్చారన్నారు. ఆయుర్వేద వైద్య రంగంలోనూ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ విశేష సేవలు అందించారన్నారు. 120 రకాల ఔషధాలను తయారు చేసి దేశ విదేశాలకు పంపిణీ చేసిన మహనీయుడని కొనియాడారు. అగ్నికుల క్షత్రియ సమాజానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన కృషి ఫలితంగానే 1927లో జీవో నెం. 271 ద్వారా అగ్నికుల క్షత్రియులు అనే అధికారిక గుర్తింపు లభించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించడం సమాజానికి దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. భావి తరాలకు పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ సేవలు తెలియజేయాలన్న లక్ష్యంతో ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు.

# రైల్వే కోడూరు టౌన్ పరిధిలో గంజాయి పరీక్షలు




**రైల్వేకోడూరు ఆగస్టు 7 మనం న్యూస్:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో, రైల్వే కోడూరు సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రైల్వే కోడూరు టౌన్లో గంజాయి వినియోగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్వేల్ రోడ్లోని హాస్పిటల్ సమీపంలో గంజాయి టెస్ట్ కిట్లను ఉపయోగించి మొత్తం 210 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో భాగంగా పోలీసులు ఈ ప్రత్యేక తనిఖీలను చేపట్టారు.

**గంజాయి సరఫరా వ్యవస్థపై ప్రత్యేక నిఘా.**

గంజాయి వినియోగం, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు పోలీసు సమాచారదారుల వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. గంజాయి సరఫరా చేసే వ్యక్తులు, విక్రయదారులు, వినియోగదారుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.ప్రజలు గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, సరఫరాకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేసి సహకరించాలని పోలీసులు కోరారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## వ్యవస్థీకృత నేరం!

ల్యాబ్ గడప తొక్కలేదు
పుస్తకం విప్పలేదు..కానీ వైద్య సరంజామా అంతా
వచ్చేసింది చాలా నీట్‌గా!
గుండె చప్పుడు వినే 'స్టెతస్కోప్' అడగబోయి-
లంచాలు మింగే 'సెక్షన్‌స్కోప్'లా
వ్యవస్థను వాడేవారు చాలా నీట్ గా!
బాడీ టెంపరేచర్ కొలిచే 'థర్మామీటర్' కాదిది -
పరీక్ష పేపర్ల రేటును పెంచే'టర్మినేటర్'
అని ముందే మార్చేశారు చాలా నీట్‌గా!

మందులు ఎక్కించే 'సిరంజి'తో పనిలేదు -
పేదోడి భవిష్యత్తును పిండేసే
'స్పాంజి'లా దాన్ని మార్చేశారు చాలా నీట్‌గా!
ఆపరేషన్ చేసే 'సర్జికల్ బ్లేడు' అడగబోయి -
మెరిట్ విద్యార్థుల గొంతులు
కోసే 'పొలిటికల్ బ్లేడు' తో
ప్రాక్టికల్స్ చేసేశారు చాలా నీట్ గా!
గాయాలకు కట్టే 'బ్యాండేజ్' బదులుగా -
ల్యాబ్ బయటే సాక్ష్యాలకు'బాండేజ్'
నేర్పేశారు చాలా నీట్ గా!

పేషెంట్ కు ఇచ్చే 'అనస్థీసియా' అనబోయి -
ప్రజలందరినీ మత్తులో ముంచేసే
'ఆమ్నేషియా' ఇచ్చేశారు చాలా నీట్ గా!
ఆక్సిజన్ అందించే'వెంటిలేటర్'
మీద పెట్టాల్సింది పోయి- ర్యాంకుల వ్యాపారం చేసే
'ఇన్క్యుబేటర్'లో సీట్లను పెంచేశారు చాలా నీట్ గా!
మైక్రోస్కోప్ లో బ్యాక్టీరియాని చూడటం మానేసి -
'మ్యాక్రోస్కోప్' వేసి సీట్లు రేట్లను పెద్దగా చూస్తూ
వ్యాపారం ముగించారు చాలా నీట్ గా!

బీపీ కొలిచే 'స్పిగ్మో మానోమీటర్' అనబోయి -
విద్యార్థులు రక్తాన్ని పీల్చే 'స్మగ్లర్-మానోమీటర్' తో
పోరాటాన్ని నిలిపేశారు చాలా నీట్ గా!
ఈసీజీ తీసి గుండె
లయను కనిపెట్టడం రాకపోయినా -
లీకేజీ నెట్ వర్క్ కోసం 'టెలిగ్రామ్' గ్రూపుల
లయను మాత్రం కనిపెట్టారు చాలా నీట్ గా!
ప్రిస్క్రిప్షన్ రాయడం నేర్చుకోకుండానే -
లీకేజీ వీరులతో కలిసి సీట్లు కోసం 'సబ్ స్క్రిప్షన్'
ప్లాను గీశారు చాలా నీట్ గా!
ఎండోస్కోపీ చేసి రోగి లోపలి
భాగాలను చూడటం పక్కనపెట్టి -
'విండో-స్కోపీ' (కిటికీ గుండా) పేపర్లు బయటకు
తోసేయడం నేర్చుకున్నారు చాలా నీట్ గా!
గుండె నాళాల్లో బ్లాక్స్ తొలగించే
'బైపాస్ సర్జరీ' నేర్చుకోకుండానే -
రూల్స్ అన్నిటీనీ దాటేసి వెళ్ళే
'లైసెన్స్-సర్జరీ'తో సీట్లు కొట్టేశారు చాలా నీట్ గా!

నీరసించిన రోగికి
'సెలైన్ బాటిల్' ఎక్కించడం తెలియదు కానీ -
మెరిట్ విద్యార్థుల రక్తాన్ని మాత్రం 'వైన్ బాటిల్' లా
తాగేస్తున్నారు చాలా నీట్ గా!
చివరకు ...
రోగాలకు 'ట్రీట్ మెంట్'
ఇవ్వడం చేతకాకపోయినా- 'లీకేజీ బ్రోకర్లతో'
అగ్రిమెంట్' మాత్రం రాసుకున్నారు చాలా నీట్ గా!

వైద్యో నారాయణో హరిః అనే 'నినాదాన్ని' మరిచి -
నోట్ల కోట్ల కోసమే 'విధానాన్ని' మార్చేశారు
చాలా నీట్ గా!
స్టెతస్కోప్ తగిలించాల్సిన మెడలో
'సస్పెన్షన్ ఆర్డర్' పడేలా -
న్యాయం దేవత చేతిలో
'ఫైనల్ జడ్జిమెంట్' రాసి ఉంది
ఇంకా చాలా నీట్ గా!

**- సర్వేశ్వరరావు నీలం**
630 4664 725

# హిరోషిమా నాగసాకి విధ్వంసం!!

ప్రపంచంలో జరిగిన అత్యంత ప్రమాదకర మానవ ప్రేరేపిత సంఘటనలలో ముఖ్యమైనవి హిరోషిమా మరియు నాగసాకిలపై అణు బాంబుల దాడి. హిరోషిమా మరియు నాగసాకి జపాన్ లోని నగరాలు.

1945 లో ఆగస్టు 6 వ తేదీన సోమవారం ఉదయం 8.15 నిమిషాలకు రెండవ ప్రపంచ యుద్ధంలో భాగంగా ఎనోలాగే' ఆ-29 బాంబర్ విమానం ద్వారా 'లిటిల్ బాయ్' అనే పేరుతో యురేనియం అణుబాంబు అమెరికా హిరోషిమా పై ప్రయోగించడం వలన ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. హీరోషిమా జపాన్ లోని పారిశ్రామిక నగరం మరియు అక్కడ సైనిక స్థావరాలు కూడా ఉన్నాయి విస్ఫోటనం వల్ల సుమారు 80 వేల మంది మరణించిన ఆ సంవత్సరం చివరికి వారి సంఖ్య లక్ష 40 వేలకు చేరింది.

1945 ఆగస్టు 9 గురువారం నాడు మధ్యాహ్నం 11 గంటల సమయంలో జపాన్ లోని నాగసాకి మీద 'ఫ్యాట్ మ్యాన్' అనే ప్లూటోనియం అణుబాంబును అమెరికా ప్రయోగించడం వల్ల సుమారు 35,000 మంది చనిపోవడం జరిగింది ఈ సంఖ్య ఆ సంవత్సరం చివరినాటికి 79000 చేరింది.

హిరోషిమాపై అణు విస్ఫోటనంజరిగినప్పుడు మేఘాలు పుట్టగొడుగు మాదిరి ఏర్పడ్డాయి అని బాంబు విస్ఫోటనం జరిగినప్పుడు పెద్ద కాంతి వచ్చిందని తర్వాత భయంకరమైన శబ్దం వినిపించదని ఆ సమయంలో ఉండి బయటపడిన వారు చెప్పిన వివరాలు. బాంబు విస్ఫోటన సమయంలో ప్రాణాలతో బయటపడిన వారిని 'షిబాకుషా' అని అంటారు.

అణువిస్ఫోటనం వలన చాలా మంది చనిపోవడంతో పాటు ఉన్నవాళ్లు శరీరం కాలిపోవడం మరియు శరీరంలో కొన్ని అవయవాలను కోల్పోవడం, రేడియేషన్ ప్రభావం వలన చాలా



మందికి క్యాన్సర్ వంటి వ్యాధులు రావడం జరిగింది. ఆ ప్రాంతంలో గాలి, నీరు, నేల కాలుష్యంతో పాటు పర్యావరణ ప్రమాదాలకు కారణమైంది. బాంబు పడిన చోట దాదాపు 75 సంవత్సరాల వరకు గడ్డి కూడా మొలవలేదంటే దాని తీవ్రత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏది ఏమైనా యుద్ధాలు అనేవి ప్రపంచ వినాశన కారకాలు ముఖ్యంగా అణు బాంబు దాడులు అనేవి చాలా భయంకరమైనవి, బాధాకరమైనవి. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది అయితే దానికి కావాల్సింది కొంచెం సహనం. ప్రభుత్వాన్ని నడిపే వారికి మామూలు వారితో పోలిస్తే కొంచెం ఎక్కువే కావాలి లేదంటే అధిక వినాశనం తప్పదు అన డానికి ఇది ఒక ప్రత్యక్ష ఉదాహరణ.

ప్రతి సంవత్సరం ఆగస్టు 6 మరియు 9వ తారీకులలో హిరోషిమా మరియు నాగసాకి దినోత్సవం ప్రపంచంలో అన్ని దేశాలు జరుపుకోవడంలో ముఖ్య ఉద్దేశం ప్రపంచంలో ఏ దేశం కూడా ఇకముందు అణుబాంబుని ప్రయోగించకూడదని దాని వల్ల వచ్చే దుష్ఫలితాలు హిరోషిమా, నాగసాకి దుర్ఘటనలు మనకు కళ్ళకు కట్టినట్లు కనిపించాయి కనుక ఏ దేశం ఆ విధంగా ముందుకు పోరాదని చిన్నప్పటి నుంచే పిల్లలకు ఈ విషయాలన్నీ అవగాహన కల్పించడం ఎంతో అవసరం.

అణుబాంబు ప్రయోగం జరిగి దాదాపు 80 సంవత్సరాలు దాటుతున్న అది చేసిన గాయం ఇప్పటికీ మానకుండానే ఉన్నది! శాస్త్రం విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన శాస్త్రంతో కనిపెట్టిన కొత్త వస్తువులు లేదా పదార్థాలు మానవాళి మనుగడకు ఉపయోగపడాలి గానీ కనిపెట్టిన మానవ జాతిని సైతం నాశనం చేసే విధంగా ఉండకూడదు! కానీ ఇది చెప్పినంత సులువేమీ కాదు ఎందుకంటే లోకో భిన్న రుచి! ఈ లోకంలోనే ఏ వ్యక్తి ఇంకో వ్యక్తితో సమానంగా ఉండలేడు, ఉండడు కూడా కానీ ఇక్కడ ఉన్న సమస్య ఏమిటంటే ప్రతి వ్యక్తి ఇంకొక వ్యక్తితో పోల్చుకొని అలా లేనప్పుడు దాని సాధించడానికి అవలంబించే వివిధ పద్ధతులు లేదా అడ్డదారులు మనిషిని మానవ మృగంగా మారుస్తున్నాయి!

ప్రపంచంలో దేశాల అధినేతలు ఏ సమస్య అయినా కూర్చుని పరిష్కరించుకోవాలి లేదా మూడో వ్యక్తి సమక్షంలో ఒక పరిష్కారానికి రావాలి తప్పితే యుద్ధాల జోలికిపోయి ఆ యుద్ధంలో అణుబాంబుల ప్రయోగం చేసి ఈ భూ మండలాన్ని నాశనం చేయడం సరైనది కాదు. కనుక అందరూ శాంతియుతంగా ఉండాలి. అలా అయితేనే ప్రపంచ శాంతి వర్ధిల్లుతుంది.

**- ఏడుకొండలు కళ్ళేపల్లి**
9490832338

# భారత జల విధానం మారాలి



1967 ఆగస్టు 4న జాతికి అంకితమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు 2026 ఆగస్టు 4తో 60వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఇది ఒక ఆనకట్ట వార్షికోత్సవం మాత్రమే కాదు. స్వాతంత్ర్యానంతర భారతదేశ జల విధానాన్ని సమీక్షించుకోవడానికి, జల భద్రతను పునర్నిర్వచించుకోవడానికి ఒక సందర్భం. ఆరు దశాబ్దాల క్రితం దేశం ఎదుర్కొన్న సమస్యలకు నాగార్జునసాగర్ సమాధానమైతే, నేడు దేశం ఎదుర్కొంటున్న కొత్త జల సంక్షోభాలకు అదే ప్రాజెక్టు కొత్త పాఠాలు నేర్పుతోంది.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశానికి ప్రధాన సవాలు ఆహార కొరత. వ్యవసాయం పూర్తిగా వర్షాలపై ఆధారపడేది. కృష్ణా వంటి మహానది ప్రవహిస్తున్నప్పటికీ, దాని నీటిలో పెద్ద భాగం వినియోగం కాకుండానే సముద్రంలో కలిసిపోయేది. అందుకే అప్పటి నాయకత్వం పెద్ద జలాశయాలు, సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి వ్యూహానికి కేంద్రంగా పెట్టింది. నాగార్జునసాగర్ కూడా అదే ఆలోచనకు ప్రతిరూపం. ఇది కేవలం ఒక ఆనకట్ట కాదు. సాగునీరు, జలవిద్యుత్, తాగునీరు, ప్రాంతీయ అభివృద్ధిని ఒకే వేదికపైకి తీసుకొచ్చిన సమగ్ర అభివృద్ధి నమూనా.

ఆ దృష్టిలో చూస్తే నాగార్జునసాగర్ తన చారిత్రక బాధ్యతను విజయవంతంగా నిర్వర్తించింది. సాగునీటి విస్తరణతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందింది. హరిత విప్లవానికి అవసరమైన నమ్మ కమైన నీటి వనరు లభించింది. జలవిద్యుత్ ఉత్పత్తి పెరిగింది. అనేక పట్టణాలు, గ్రామాలకు తాగునీరు అందింది. ఒకప్పుడు కరువుకు ప్రతీకగా ఉన్న ప్రాంతాలు దేశ ఆహార భద్రతలో కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకున్నాయి.

అయితే నేడు దేశం ఎదుర్కొంటున్న సమస్య 1950ల



సమస్య కాదు. అప్పట్లో సవాలు ఆహార కొరత అయితే, ఇప్పుడు సవాలు నీటి కొరత. జనాభా మూడు రెట్లకు పైగా పెరిగింది. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వేగవంతమయ్యాయి. వ్యవసాయం ఇప్పటికీ దేశంలోని తీపి నీటి వినియోగంలో దాదాపు 80 శాతం వాటాను వినియోగిస్తోంది. నీతి ఆయోగ్ అంచనా ప్రకారం దాదాపు 60 కోట్ల మంది భారతీయులు తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అందువల్ల ఇప్పుడు జల విధానం లక్ష్యం మరిన్ని జలాశయాలు నిర్మించడం మాత్రమే కాకుండా, ఇప్పటికే నిల్వ చేసిన ప్రతి నీటి బొట్టును మరింత సమర్థంగా వినియోగించడం కావాలి. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పు నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల పాత్రను మరింత క్లిష్టం చేసింది. ఒకవైపు దీర్ఘకాలం వర్షాభావం, మరోవైపు కొద్ది సమయంలోనే కురిసే భారీ వర్షాలు-ఈ రెండింటినీ ఒకే జలాశయం సమర్థంగా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పూడిక పేరుకుపోవడం వల్ల నిల్వ సామర్థ్యం క్రమంగా తగ్గుతోంది. పాత కాలువల ద్వారా గణనీయమైన నీటి నష్టం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో దశాబ్దాల క్రితం రూపొందించిన నిర్వహణ విధానాలు సరిపోవు. వాతావరణ అంచనాలు, రియల్టైమ్ జల సమాచారం, శాస్త్రీయ జలాశయ నిర్వహణ ఇప్పుడు అత్యవసరంగా మారాయి.

నాగార్జునసాగర్ మరో ముఖ్యమైన పాఠాన్ని కూడా నేర్పుతోంది. కృష్ణా జలాల పంపిణీపై రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న వివాదాలు, వ్యవసాయం-పట్టణాలు-పరిశ్రమల మధ్య పెరుగుతున్న పోటీ, భూగర్భ జలాలపై అధిక ఆధారపడటం వంటి అంశాలు నీటి నిర్వహణను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. పారదర్శక సమాచారం, శాస్త్రీయ నిర్ణయాలు, సహకార సమాఖ్య స్ఫూర్తితో కూడిన నదీ పరీవాహక ప్రాంత నిర్వహణ లేకుండా భవిష్యత్తులో ఈ వివాదాలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

దీని అర్థం భారీ ఆనకట్టల ప్రాధాన్యం తగ్గిందని కాదు. వాటి పాత్ర మారిందన్న మాట. మొదటి తరం ప్రాజెక్టులు దేశానికి నీటి భద్రతను తీసుకొచ్చాయి. రెండో తరం సంస్కరణలు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచాలి. కాలువల ఆధునీకరణ, సూక్ష్మ సేద్యం, భూగర్భ జలాల పునరుద్ధరణ, పంటల వైవిధ్యీకరణ, ఉపగ్రహ ఆధారిత జలాశయ పర్యవేక్షణ, కృత్రిమ మేధ ఆధారిత జలాశయ నిర్వహణ, డిజిటల్ జల గణాంక వ్యవస్థలు ఇప్పుడు జల విధానంలో అంతర్భాగం కావాలి.

నాగార్జునసాగర్ 60వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఈ సమయంలో దాని వారసత్వాన్ని కేవలం నిల్వ సామర్థ్యంతోనో, ఉత్పత్తి చేసిన విద్యుత్తోనో, సాగునీరు అందించిన ఎకరాలతోనో కొలవడం సరిపోదు. భారతదేశం మొదటి సవాలు ఆనకట్టలను నిర్మించడం అయితే, నేటి సవాలు వాటిని మరింత సమర్థంగా నిర్వహించడం. నీటి కొరత, వాతావరణ మార్పు, పెరుగుతున్న అవసరాల మధ్య భారత జల భద్రత భవిష్యత్తు కొత్త ప్రాజెక్టుల నిర్మాణంపై కాదు. ఇప్పటికే ఉన్న నాగార్జునసాగర్ వంటి జాతీయ ఆస్తులను శాస్త్రీయంగా, సాంకేతికంగా, సహకార సమాఖ్య స్ఫూర్తితో ఎంత సమర్థంగా నిర్వహిస్తామన్న దానిపైనే ఆధారపడి ఉంటుంది. అదే నాగార్జునసాగర్ 60 ఏళ్ల ప్రయాణం మనకు నేర్పుతున్న అత్యంత విలువైన పాఠం.

**- డి జె మోహన రావు**
8247045230

# సామాజిక జీవితాన్ని అక్షరబద్ధం చేసిన యశోదారెడ్డి

ఆమె తెలంగాణ గర్వించ దగిన సాహితీ మూర్తి. తెలంగాణ సజీవ భాషను తన రచనల్లో వాడి పలువురి మన్ననలు పొందిన సాహితీవేత్త. ఆకాశవాణిలో తెలంగాణ మాండలికంలో ప్రసంగం చేసిన తొలి రచయితగా పేరు గడించారు. తెలుగు ప్రాచీన సాహిత్యంపై ఆమె చేసిన ప్రసంగాలు బహు పండిత ప్రశంసా పాత్రాలు అయినాయి. ఆమే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలుగా పని చేసి గుర్తింపు పొందిన పాకాల యశోదారెడ్డి.

పాకాల యశోదారెడ్డి సంస్క ృతాంధ్ర భాషల్లో విదుషీ మణి, పరిశోధకురాలు, సాహిత్య విమర్శకురాలు. వచన కవిత్వం కూడా వ్రాసారు. . ఆమె వేదికలమీద అనర్గళంగా ఉపన్యసించి మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. ఆమె వాగ్ధాటికి శ్రోతలు తన్మయులయ్యే వారు. అచ్చమైన తెలుగు, సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో కూడిన ప్రసంగాలు విన ఇంపుగా ఉండేది. 1950 దశకారంభం నుంచే ఆమె ఆలిండియా రేడియోలో 'మహాలక్ష్మి ముచ్చట్లు' అని వినిపించేది.

యశోదా రెడ్డి ప్రముఖ రచయిత్రి. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసి, పదవీ విరమణ చేశారు. పలు సాహిత్య విమర్శనా గ్రంథాలు రాశారు. కథా సంపుటాలను వెలువరించారు. పాకాల యశోదారెడ్డి 1929, ఆగష్టు 8 న పాలమూరు జిల్లా ( నాగర్‌కర్నూల్ జిల్లా), బిజినేపల్లిలో సరస్వతమ్మ, కాశిరెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. యశోదారెడ్డి మూడవ తరగతి వరకు మహబూబ్‌నగర్‌లో, ఉన్నత పాఠశాల విద్యను హైదరాబాద్, నారాయణగూడ లోని బాలికల ఉన్నత పాఠశాలలోను పూర్తి చేశారు. రాజబహద్దూర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహంతో కళాశాల విద్య కొనసాగించి, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి తెలుగు, సంస్కృత భాషలలో స్నాతకోత్తర విద్య పూర్తి చేశారు. జర్మన్ భాషలో, భాష శాస్త్రంలో డిప్లొమా చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం లోనే 'తెలుగులో హరివంశాలు' అను అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 1976లో అలీఘర్ విశ్వ విద్యాలయం నుండి డి.లిట్ అందుకున్నారు. యశోదారెడ్డికి హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు, జర్మన్ భాషతో కూడా పరిచయం ఉండేది. ఆమె భర్త ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పి. టి. రెడ్డిగా సుపరిచితులైన పాకాల తిరుమల్ రెడ్డి. జె.జె.ఆర్ట్ కళాశాలలో చదువుకుని, కొన్నాళ్ళు లాహోర్‌లో పనిచేసి హైదరాబాదు తిరిగి వచ్చిన తిరుమల రెడ్డి, ఆమె వక్తృత్వ ప్రతిభను చూసి ఆకర్షితుడై 1947లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తిరుమల్ రెడ్డి గీసిన అనేక చిత్రాలకు ఆమే స్ఫూర్తి. యశోదారెడ్డి కూడా స్వతహాగా కళాపిపాసి. ఆమె రకరకాల ఇత్తడి విగ్రహాలను హాబీగా సేకరించే వారు. పి.టి రెడ్డి సాంగత్యంతో వాటిలోని కళానైపుణ్యాన్ని, వైభవాన్ని ఆమె గుర్తించ గలిగేవారు. భర్త చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు ఒక కార్యకర్తగా పని చేసి అది విజయవంతం అయ్యేందుకు దోహదపడేది.

1955లో హైదరాబాద్, కోఠి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగ జీవితం ప్రాంభించారు. ఎందరో పరిశోధకులకు మార్గదర్శిగా నిలిచారు. ఆమె ధర్మశాల, ఎచ్చమ్మ కథలు తదితర కథా సంపుటాలను వెలువరించారు. యశోదా రెడ్డి వందకు పైగా కథలు వ్రాసినా వాటిలో 63 మాత్రమే పుస్తక రూపంలో రావడం జరిగింది. ఆమె ప్రచురించిన మూడు కథా సంపుటాల్లో, మావూరి ముచ్చట్లు (1973) కథా సంపుటి 1920-40 నాటి తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రీకరిస్తే, ఎచ్చమ్మ కథలు (1999) 1950-70 నాటి తెలంగాణ సంస్క ృతికి ప్రతీకలు, ధర్మశాల (2000) కథా సంపుటి 1980-1990 నాటికి తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పులకు దర్పణం పట్టింది. ఈ మూడు కథా సంపుటాల్లో ఈమె తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని, సామాజిక జీవితాన్నిఅక్షర బద్ధం చేశారు. మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు, పాలమూరు జిల్లా మాండలికంలో వ్రాస్తే, ధర్మశాల కథా సంపుటిని మాత్రం వ్యవహారిక తెలుగు భాషలో లిఖించారు.

యశోదారెడ్డి కథలు తెలంగాణ జనజీవన సంస్కృతిను, తెలంగాణా మాండలిక నుడికారానికి అద్దం పడతాయి. ఎచ్చమ కథలకు ముందుమాటలో 'ఒక జాతి సంస్కృతిలో ఆ జాతి జీవన విధానం ప్రతిఫలిస్తుంది. ఈ సంస్కృతీ సర్వస్వం ఆ జాతి భాషలో నిక్షిప్తమై జీవిస్తుంది. ఆ భాష ఆ జాతికి ప్రత్యేకమైన ఆచార వ్యవహార, ఆర్థిక, రాజకీయ, సామాజిక మూలధాతువులను జీర్ణించుకొని రససిద్ధిని పొంది జాతీయాల్లో, పలుకుబళ్లలో, సామెతల్లో పొందుపడి ప్రభుత్వాన్ని నెరపుతుంది. ఒక భాషలో ఒక నానుడి కానీ, సామెత కానీ, జాతీయం కానీ అలవోకగా పుట్టదు. ఆయా జాతీయులు, తలలు పండినవారి అనుభవాన్ని వీడబోసి నిగ్గుదేల్చిన సారమే ఈ నుడికారపు ఇంపుసొంపులు. అందుకే అవి భాషకు జీవనాడి. ప్రాణ ధాతువుల వంటివి' అని అభిప్రాయడిన యశోదారెడ్డి తన కథల నిండా తెలంగాణ నుడికారపు సొంపులకు పెద్దపీట వేశారు.

యశోదారెడ్డి కథారచయిత్రిగానే కాకుండా కవయిత్రిగా కూడా ప్రసిద్ధులే. ఆమె రాసిన కవితలు అనేక పత్రికలలో ముద్రించబడ్డాయి. స్వయంగా తానే తన కవితలను 'ఉగాదికి ఉయ్యాల', 'భావిక' అనే రెండు సంపుటాలుగా వెలువరించారు. పారిజాతాపహరణం, ఉత్తర హరివంశం, తెలుగు సామెతలు, ఆంధ్ర క్రియా స్వరూపమణి దీపిక మొదలగు పుస్తకాలకు సంపాదకత్వం వహించి, విలువైన పీఠికలను రాసి, వెలువరించారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ, సంగీత అకాడమీలలో సభ్యురాలిగా



పని చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్, జానపద కళా సాహిత్య సంస్థలతో ఆమెకు అనుబంధం ఉండేది. బహుముఖ ప్రజ్ఞావంతురాలైన యశోదారెడ్డి, పరిశోధకురాలిగా, విమర్శకురాలిగా, కథా రచయిత్రిగా, నాటక రచయిత్రిగా, కవయిత్రిగా అనువాదకురాలిగా తెలుగు సాహితీరంగంలో ప్రసిద్ధి పొందారు. మహావక్తగా, తెలంగాణ మాండలికానికి అచ్చమైన ప్రతీక. సంస్కృత సమాస భూయిష్ఠమైన సంప్రదాయ విమర్శలోనూ, సహజ సుందరమైన జానపదుల నుడికారంలోనూ రచనలను చేసిన సవ్యసాచి. యశోదారెడ్డి 2007, అక్టోబర్ 7 న హైదరాబాదులో మరణించారు.

**ఆగస్టు 8 పాకాల యశోదారెడ్డి జయంతి**

**- రామ కిష్టయ్యా సంగన భట్ల**
9440595494

# నేతన్న చేనేతకు సలాం



మానవుడి కనీస అవసరాలు కూడు, గూడు, గుడ్డ అని మనకు తెలుసు. వ్యవసాయం తర్వాత అతి పెద్ద పరిశ్రమగా చేనేత హస్తకళలకు గుర్తింపు ఉన్నది. పుట్టిన నాటి నుండి గిట్టే వరకు మన శరీరం మీద వస్త్రాలు తప్పనిసరి. మనం ధరించే వస్త్రాలు మన మానసిక, శారీరక, ఆర్థిక, సామాజిక, వ్యక్తిత్వ గుణాల స్థాయిని రుజువు చేస్తాయి. పంచె కట్టులో పురుషులు, చీర కట్టులో స్త్రీలు అందంగా, హుందాగా, ఆకర్షణీయంగా, సాంప్రదాయం ఉట్టిపడే విధంగా కనుపిస్తారు. నేతన్న చేతుల్లో మాయాజాలం ఫలితంగా సప్తవర్ణ సింగిడి రంగులు వస్త్రాలకు అందాల విందులు ఆరబోస్తాయి. నేతన్న సృజన, దారం పోగును నాట్యం చేయించగల హస్తకళా నైపుణ్యం సదా అభినందనీయం. నాటి చేనేత వస్త్రాల నుంచి నేటి ఆధునిక సాంకేతిక యంత్రాల వినియోగం వరకు వస్త్ర పరిశ్రమ ఊహించనంతగా అభివృద్ధి చెందడం చూస్తున్నాం. అనాదిగా గ్రామీణ ప్రజానీకానికి జీవనో పాధిని కల్పిస్తున్నది. ఒక దారపు పోగు భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపదకు నిదర్శనంగా నిలుస్తున్నది. దేశ సామాజిక-ఆర్థిక సుస్థిరాభి వృద్ధికి చేనేత పరిశ్రమ ఊతం ఇస్తున్నది. స్వతంత్ర భారతంలో చేనేత హస్తకళల ప్రాధాన్యా న్ని అవగాహన పర్చడం, నేతన్నల సమస్యలకు పరిష్కారాలను వెతకడం, మన చేనేతకు అంతర్జాత గుర్తింపుకు ప్రయత్నాలు చేయడం లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని 2015 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం చొరవతో ప్రతి ఏట 7 ఆగష్టున జాతీయ చేనేత దినోత్సవం (నేషనల్ హాండ్లూమ్ డే) పాటించడం జరుగుతున్నది. 7 ఆగష్టు 1905న బెంగాల్ విభజనను చేసిన బ్రిటీష్ నిర్ణయానికి వ్యతిరేకంగా కలకత్తాలో మొదలైన స్వదేశీ ఉద్యమం ప్రారం భానికి గుర్తుగా చేనేత దినోత్సవం నిర్వహించు కోవడం ముదావహం. నేడు మన చేనేత హస్తకళల పరిశ్రమతో పాటు దాని అనుబంధ రంగాల్లో దాదాపు 70 శాతం మంది మహిళలు శ్రమ చేయడం జరుగుతున్నది. భారత చేనేత పరిశ్రమపై 32 లక్షల కుటుంబాలు ఆధారపడడంతో పాటు 4.33 మిలియన్ల ఉద్యోగ ఉపాధులు కల్పించడం కొనసాగుతున్నది. నేతన్నల ఆదాయాన్ని మెరుగు పరచడంతో పాటు వారిని శక్తివంతులుగా మార్చ డానికి చేనేత ఉపయోగపడు తున్నది.

దేశవ్యాప్తంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకల నిర్వహణ జరుగుతుంది. ఆంధ్రలో 98, తెలంగాణలో 34 క్లస్టర్లు ఉన్నాయి. ప్రపంచ వస్త్ర పరిశ్రమ ఉత్పత్తుల్లో 6.9 శాతం భారతదేశమా ఉత్పత్తి చేస్తున్నది. చైనా మాత్రం 52 శాతానికి



పైగా సడవస్త్ర మార్కెట్ను కైవసం చేసుకున్నది. చేనేత వస్త్రాల ఉత్పత్తుల్లో 95 శాతం భారతదేశమా అందిస్తున్నది. మన దేశ ఆచారాలు, వారసత్వాలను బట్టి నేతన్న చూపిస్తున్న హస్తకళా నైపుణ్యాల ప్రదర్శన వల్ల చేనేత వస్త్రాలకు ఆదరణ పెరుగుతోంది. నేతన్న కళ్లల్లో సంతోషం వర్షించాలంటే ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలపడాలి. నాటి చేనేత పరిశ్రమ తక్కువ పెట్టుబడి, స్వల్ప శక్తి వినియోగం ఉండేది. డిజిటల్ కాలంతో పాటు ఈ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా తమ డిజైన్లను మార్చడం లాంటివి సానుకూల అంశాలుగా కనిపించేవి.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## అమ్మవార్లకు శాకాంబరి అలంకరణ



వాసవి పెనుగొండ, మనం న్యూస్: ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా పెనుగొండలోని శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్దని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి వైభవంగా శాకాంబరి అలంకరణ నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ మహిషాసుర మర్దని, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవార్లను పలు రకాల కూరగాయలు, పండ్లతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష సేవలు జరిపి భక్తులకు ప్రత్యేక దర్శనాన్ని కల్పించారు. శాకాంబరి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకు నేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, కార్యక్రమం భక్తిపూర్వక వాతావరణంలో ఘనంగా జరిగింది.

## కామాక్షి అమ్మవారికి గోరింటాకుతో అలంకరణ



వాసవి పెనుగొండ, మనం న్యూస్: ఆషాఢ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా పెనుగొండలోని శ్రీ కామాక్షి అమ్మవారికి గోరింటాకుతో ప్రత్యేక అలంకరణ నిర్వహించి విశేష అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు.శ్రీ కామాక్షి అమ్మవారికి ప్రతి శుక్రవారం నిర్వహించే నూతన వస్త్రాలంకరణ సేవలో భాగంగా, ఆషాఢ మాస సారె సందర్భంగా పెనుగొండకు చెందిన చెల్లూరి ఏసుబాబు దంపతులు అమ్మవారికి నూతన చీరను సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, దాతలను సత్కరించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ, చీరను సమర్పించిన దాతల కుటుంబ సభ్యులతో పాటు అమ్మవారిని దర్శించిన భక్తులందరిపై శ్రీ కామాక్షి అమ్మవారి సంపూర్ణ అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆషాఢం చివరి శుక్రవారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అష్టోత్తర శత కలశ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం



అన్నవరం, ఆగస్టు 7, మనం న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరం గ్రామంలోని శ్రీ శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం అష్టోత్తర శత కలశ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే ఆలయ ద్వారాలు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పారాయణంతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అష్టోత్తర శత కలశాలలో పవిత్ర తీర్థాలను ఆవాహన చేసి ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. రుద్రాభిషేకంలో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీరు, చెరకు రసం, పంచామృతం, సుగంధ ద్రవ్యాలు, పవిత్ర జలాలు, బిల్వదళాలు, పుష్పాలతో స్వామివారికి విశేష అభిషేకాలు సమర్పించారు. వేదఘోషలు, 'ఓం నమః శివాయ', 'సుబ్రహ్మణ్య స్వామి శరణం' నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అభిషేక సమయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. ఆడికృత్తిక శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అత్యంత ప్రీతికరమైన పర్వదినంగా భావిస్తారు. ఈ రోజున స్వామివారిని దర్శించి రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహిస్తే సర్పదోషాలు, కుజదోషాలు, వివాహ, సంతాన సంబంధిత అవరోధాలు తొలగి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సంతాన సౌభాగ్యం, విద్యా విజయాలు, కుటుంబ శాంతి సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. అందువల్ల రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారి దివ్య దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అభిషేకం అనంతరం శ్రీవల్లి, దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని సుగంధ పుష్పాలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అత్యంత సుందరంగా అలంకరించారు.

అనంతరం అష్టోత్తర శతనామార్చన, మహామంగళహారతి, వేదాశీర్వచనం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు, స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ, ఆడికృత్తిక రోజున సుబ్రహ్మణ్య స్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు కలుగుతుందని, జీవితంలోని విఘ్నాలు తొలగి ధైర్యం, విజయం, దైవానుగ్రహం సిద్ధిస్తాయని తెలిపారు. రుద్రాభిషేకంలో పాల్గొన్న ప్రతి భక్తునికి పరమశివుడు, కుమారస్వామి అనుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు, సేవకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తుల 'హరహర మహాదేవ', 'సుబ్రహ్మణ్య స్వామి శరణం' నినాదాలతో ఆలయ పరిసరాలు మారుమోగగా, ఆడికృత్తిక మహోత్సవం ఆధ్యాత్మిక వైభవంతో ఘనంగా ముగిసింది.

## సారా వ్యతిరేక ఉద్యమ సారథి దూబగుంట రోశమ్మకు ఘన నివాళి

- **అన్నవరంలో 10వ వర్ధంతి సభ నిర్వహణ**

అన్నవరం, ఆగస్టు 7, మనం న్యూస్ : సారా వ్యతిరేక ఉద్యమ సారథి దూబగుంట రోశమ్మ 10వ వర్ధంతి సందర్భంగా అన్నవరం శ్రీ సత్యదేవ జూనియర్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వర్ధంతి సభ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి. వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జన విజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎన్. సూర్యనారాయణ మాట్లాడుతూ దూబగుంట రోశమ్మ జీవితం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. నెల్లూరు జిల్లా కలిగిరి మండలం దూబగుంట గ్రామానికి చెందిన వర్ధినేని రోశమ్మ, తన గ్రామం నుంచే ప్రారంభించిన సారా వ్యతిరేక ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడంతో 'దూబగుంట రోశమ్మ'గా గుర్తింపు పొందారని తెలిపారు. భర్త మరణానంతరం ఇద్దరు కుమారులను ఎంతో కష్టపడి పెంచినా, వారు మద్యానికి బానిసలవడంతో కుటుంబంలో ఎదురైన విషాద అనుభవాలు, గృహహింస ఆమెను సారా వ్యతిరేక ఉద్యమం వైపు నడిపించాయని వివరించారు. అక్షరదీపం కార్యక్రమంలో చదివిన 'సీతమ్మ కథ' ఆమెకు స్ఫూర్తినిచ్చిందని, ఆ స్ఫూర్తితో మహిళలను ఏకం చేసి మద్యపానానికి వ్యతిరేకంగా చారిత్రాత్మక ఉద్యమాన్ని నిర్మించారని చెప్పారు. ఆ ఉద్యమ ప్రభావంతో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకంతో రాష్ట్రంలో మద్య నిషేధాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయ వనరుగా భావిస్తూ విచ్చలవిడిగా విక్రయాలు జరపడం వల్ల ప్రజల ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మద్యానికి పూర్తిగా




దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. సూరిబాబు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె. చంటిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగాసూరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె. సింహాచలం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొని దూబగుంట రోశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఎల్ నినో ప్రభావంపై రైతులకు సమావేశం




కాత్రేనికోన ఆగష్టు 7 మనం ప్రతినిధి: కాత్రేనికోన రైతుసేవ కేంద్రం నందు ఖరీఫ్ 2026 ఎలినినో ప్రభావం- కార్యాచరణ ఉపశమన ప్రణాళిక కార్యక్రమం మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో తిమ్మాపురం లో నిర్వహించడం జరిగిందని ఏ ఓ మృదుల తెలిపారు... ఈ కార్యక్రమునుకు ముఖ్య అదితి గా జిల్లా వనరుల కేంద్రం ఏ డి ఏ రాజశేఖర్ విచ్చేసారు. ఎల్ నినో ప్రభావం పై ముందుస్తు అంచనాల నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వర్షాభావ పరిస్థితులు ప్రస్తుత పంట పరిస్థితి,నీటి కొరత వలన పంట వాడిపోవడం, చీడ పీడల ఉధృతి,ఉద్యావన పంటల పరిస్థితి ఎలినినో కారణముగా సంభవిస్తున్న పర్యావరణ మార్పులు ,వాటి ప్రభావం గురించి రైతులు కు తెలిపారు .ఈ కార్యక్రమంలో కొందరు రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ పనులు ముమ్మరం గా జరుగుతున్న సమయంలో ఈ సమావేశం ఏర్పాటు చేయడం రైతులకు ఎంత వరకు ఉపయోగమో ఆ శాఖ అధికారులకు తెలియాలి.

## సత్యదేవుని సన్నిధి నుంచి తలుపులమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పణ

అన్నవరం, ఆగస్టు 7, మనం న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై వెలసిన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నుంచి శ్రీ తలుపులమ్మ అమ్మవారికి సంప్రదాయ బద్ధంగా పట్టువస్త్రాలు, మంగళద్రవ్యాలు, ఫలపుష్పాలతో కూడిన పవిత్ర సారెను శుక్రవారం ఘనంగా సమర్పించారు. దేవస్థానం కార్యనిర్వహణా, దికారి నల్లం సూర్యచక్రధరరావు, దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా శ్రీ సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, వివిధ రకాల ఫలాలు, పిండివంటలతో కూడిన సారెను సిద్ధం చేసి తలుపులమ్మ క్షేత్రానికి తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. తలుపులమ్మ దేవస్థానానికి చేరుకున్న అన్నవరం దేవస్థానం ప్రతినిధి బృందానికి అక్కడి



ఈవో విశ్వనాథరాజు, ధర్మకర్తల మండలి చైర్మన్ పెంటకోట భాస్కర సత్యనారాయణ ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేసి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆనవాయితీగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం ద్వారా రెండు దేవాలయాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధం మరింత బలోపేతం కావడంతో పాటు, భక్తులందరికీ స్వామివారు, అమ్మవారి అనుగ్రహం లభించాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## నీతి నిజాయితీ లేని నరేంద్ర మోడీ ప్రభుత్వం

- **సామాన్య కౌలు రైతులకు న్యాయం చేయాలి**
- **సిఐటియు జిల్లా అధ్యక్షులు కేతగోపాలం**




ఆచంట ఆగస్టు 7 మనం న్యూస్: నీతి నిజాయితీ లేని నరేంద్ర మోడీ ప్రభుత్వం కవులు రైతుల సామాన్య ప్రజలకు న్యాయం చేయకపోతే సంఘటితంగా పోరాడుతాం అని కౌలు రైతుల జిల్లా అధ్యక్షులు కేత గోపాలం అన్నారు సామాన్య ప్రజల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ పై ర్యాలీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్నదాతలను నిత్యం దగా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు

కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు ఇప్పటికైనా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ప్రతి కరీపు సీజన్లో పంటలకు రుణాలు ఇ6వ్వాలని ఆయన అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని లేకుంటే సంఘటితంగా పోరాడి ఆంధ్రప్రదేశ్ రోడ్లు స్తంభింప చేస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కౌలు రైతులు కామ్రేడ్స్ మరియు ఆచంట నియోజకవర్గం తదితర్ల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు

## 9 బస్సులపై కేసులు నమోదు




అమలాపురం ఆగష్టు 7 మనం న్యూస్: శుక్రవారం ఈతకోట టోల్ ప్లాజా వద్ద 39 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించడం జరిగిందని జిల్లా రవాణా శాఖ అధికారి దేవి శెట్టి శ్రీనివాస రావు తెలిపారు , ఈ తనిఖీ లలో ఇతర క్రమరాహిత్యములు కనుగొన్న 9 బస్సులపై కేసులు నమోదు చేసి 21,600 రూపాయలు అపరాధ రుసుము విధించామని, అతివేగం, సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్ అదేవిధంగా వ్యక్తిగత బ్యాగేజీ మినహా కమర్షియల్ లగేజీ తో ప్రయాణించే బస్సు పట్టుపడితే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. నిరంతరం ఈ తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్స్ ఓలేటి శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, షణ్ముఖ్ శ్రీనివాస్ పాల్గొన్నారు..

## అడిగింది పది వేలు ఇచ్చింది యాభై వేలు



- **ఆనందంతో ఉప్పొంగిన యువకుడు**

పాలకొల్లు, ఆగష్టు 7,మనం ప్రతినిధి : పాలకొల్లుకు చెందిన మండెలనాని శ్రీరామ్ ఐఐటీకి ఎంపికై మద్రాస్ ఇంటర్న్షిప్ కు వెళ్తున్నందుకు యలమంచిలి మండలం కారుణ్య ట్రస్ట్ అధినేత దొంగనాగేశ్వరరావు తన స్వగృహంలో లో శుక్రవారం50 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. మండల మండేల నాని శ్రీరామ్ తండ్రి వెంకట సుబ్బారావు కి అందజేశారు. 50 వేల రూపాయలు అందుకున్న తండ్రి కుమారుల ఆనందానికి అవధులు లేవు.వారు అడిగింది 10 వేల రూపాయలు మాత్రమే ఇచ్చింది మాత్రం 50,000 రూపాయలు కారుణ్య ట్రస్ట్ అధినేత నాగేశ్వరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేనందున తండ్రి వెంకట సుబ్బారావు పాలకొల్లు లో ఉన్న కొందరి వద్దకు తిరిగిన ప్రయోజనాలు లేకపోయింది. దాంతో ఏం చేయాలన్న పరిస్థితుల్లో ఉండగా కారుణ్యట్రస్ట్ చైర్మన్ నాగేశ్వర దృష్టికి రావడంతో వారి వివరాలు తెలుసుకొని ఆర్థిక సహాయం అందించారు. ఇప్పటికే కారుణ్య ట్రస్ట్ ద్వారా అనేకమంది పేదలకు పేద విద్యార్థులకు నిత్యం ఆర్థిక సాయం అందిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఆర్థిక సహాయం చేస్తున్న తుంగా నాగేశ్వరావుని కి అనేకమంది అభినందనలు తెలుపుతున్నారు.

## మార్గదర్శకాల ప్రకారం ఆహార భద్రత పథకాలను పక్కాగా అమలు చేయాలి

- **రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈ. లక్ష్మీరెడ్డి**
- **జిల్లాలో ఆహార భద్రతా పథకాల అమలుపై ఆకస్మిక తనిఖీలు**



విశాఖపట్నం, ఆగష్టు 7 మనం న్యూస్ : ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అన్ని ఆహార భద్రతా పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందేలా చూడాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈ. లక్ష్మీరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన విశాఖపట్నం జిల్లాలో ఆహార భద్రతా పథకాల అమలుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా పెదవాల్తేరు-2, ఆదర్శ్నగర్-1, పెద్దజాలారిపేట-1, 4, 5 అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థుల హాజరు, గుడ్లు, పాలు, నూనె, రేషన్ సరుకుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, భౌతిక నిల్వలను పరిశీలించారు. ఆదర్శ్నగర్-1 అంగన్వాడీ కేంద్రంలో గుడ్ల కొరతను గుర్తించారు. స్టాక్ నమోదులకు, భౌతిక నిల్వలకు మధ్య వ్యత్యాసాలు ఉండటంతో పాటు దెబ్బతిన్న గుడ్లు, ఇతర లోపాలను గమనించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.అనంతరం పెద్దజాలారిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్, చిన్నబుజ్జి రాజుపాలెం ఎంపీపీ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) అమలు, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పాటిస్తున్న తీరును, స్టాక్ రిజిస్టర్లు, భౌతిక నిల్వలను నిశితంగా పరిశీలించారు.

## విడాకుల కేసు వెనక్కి తీసుకున్న తమిళనాడు సీఎం విజయ్ సతీమణి

చెన్నై, ఆగష్టు 7: తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ విడాకుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. విజయ్ నుంచి విడాకులు కోరుతూ కోర్టులో వేసిన పిటిషన్ను ఆయన భార్య సంగీత వెనక్కి తీసుకున్నారు. నేడు ఈ కేసు విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన సంగీత.. తన కేసును కొనసాగించకపోవడానికి గల కారణాలను న్యాయస్థానానికి వివరించారు. దీంతో ఈ కేసును ముగిస్తున్నట్లు చెంగల్పట్టు జిల్లా కోర్టు ప్రకటించింది. విజయ్పై పలు ఆరోపణలు చేస్తూ ఆయన సతీమణి సంగీత విడాకులు కోరుతూ ఫిబ్రవరిలో చెంగల్పట్టు కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిష్న విచారణకు ఇరువురూ హాజరు కాకపోవడంతో కోర్టు పలుమార్లు విచారణను వాయిదా వేసింది. ఆ సందర్భాల్లో వారి తరఫు న్యాయవాదులు హాజరై.. విచారణకు ప్రత్యక్షంగా హాజరుకావడంలో నెలకొన్న ఇబ్బందులను కోర్టుకు వివరించారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరుగుతూ వచ్చింది. విజయ్కు 1999 ఆగస్టు 25న సంగీతతో వివాహం జరగ్గా.. వారికి కుమారుడు, కుమార్తె ఉన్న విషయం తెలిసిందే.

## నిత్య అన్న ప్రసాద మహాయజ్ఞానికి ధర్మకర్త గుత్తికొండ శ్రీలత ఉదార కానుక

- **తన పదవీ కాలమంతా ప్రతి రెండు నెలలకు రూ.1 లక్ష చొప్పున విరాళం అందించనున్నట్లు సంకల్పం**
- **తొలి విడతగా రూ.1 లక్ష చెక్కు సమర్పణ**

సింహాచలం ఆగస్టు 7 మనం న్యూస్ : 'అన్నం పరబ్రహ్మ స్వరూపం... అన్నదానం మహాదానాలలో అగ్రగణ్యం...' అని వేదాలు, పురాణాలు కొనియాడిన సనాతన ధర్మ సంప్రదాయాన్ని సాక్షాత్కరిస్తూ, శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రమైన సింహాచలంలో నిత్యం వేలాది మంది భక్తులకు ప్రసాదించబడుతున్న శ్రీ సింహాద్రినాథ నిత్య అన్నప్రసాద మహాయజ్ఞంకు సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు గుత్తికొండ శ్రీలత తన భక్తి, సేవాతత్పరత, దాతృత్వాన్ని చాటుకుంటూ విశిష్టమైన విరాళాన్ని ప్రకటించారు.ఆకలితో వచ్చిన భక్తునికి అన్నం పెట్టడం అంటే స్వయంగా శ్రీ సింహాద్రి అప్పన్న స్వామివారికే నైవేద్య సేవ చేసినట్లే' అనే ఉన్నత భావంతో, తన ట్రస్ట్ బోర్డు సభ్యురాలి గా పదవీ కాలమంతా ప్రతి రెండు నెలలకు



రూ.1,00,000 చొప్పున స్వామివారి సింహాద్రినాథ నిత్య అన్నప్రసాద పథకానికి విరాళంగా సమర్పించాలని పవిత్ర సంకల్పం చేశారు.ఆ మహోన్నత సంకల్పానికి శ్రీకారం చుడుతూ, తొలి రెండు నెలలకు సంబంధించిన రూ.1,00,000 చెక్కును దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావుకి భక్తిశ్రద్ధలతో అందజేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఉషశ్రీ, దాత కేతినీడు సాయికుమార్ పాల్గొని, శ్రీలత సేవాస్ఫూర్తిని, స్వామివారి పట్ల ఆమెకున్న అపార భక్తిని అభినందించారు.

ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు మాట్లాడుతూ, 'అన్నదానం అనేది కేవలం ఆకలి తీర్చే దానం మాత్రమే కాదు.అది జీవుల్లోని దైవత్వాన్ని ఆరాధించే యజ్ఞం. శ్రీ సింహాద్రి అప్పన్న స్వామివారి సన్నిధిలో నిత్యం వేలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి ఆనందభాష్పాలతో స్వామివారిని స్మరిస్తుంటారు. ఆ మహోన్నత సేవలో భాగస్వాములయ్యే ప్రతి దాతకు స్వామివారి అనంత అనుగ్రహం, అక్షయ ఐశ్వర్యం, ఆయురారోగ్యాలు, సకల సంపదలు ప్రసాదమవుతాయి. గుత్తికొండ శ్రీలత చేసిన ఈ దాతృత్వ సంకల్పం మరెందరో భక్తులకు స్ఫూర్తిగా నిలిచి, శ్రీ సింహాద్రినాథ నిత్య అన్నప్రసాద మహాయజ్ఞానికి మరింత బలాన్ని చేకూర్చాలని మనసారా కోరుకుంటున్నాం' అని పేర్కొన్నారు.ప్రతిరోజూ స్వామివారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు భేదభావం లేకుండా ప్రేమతో, పవిత్రతతో అన్నప్రసాదాన్ని అందిస్తున్న సింహాద్రినాథ నిత్య అన్నప్రసాద పథకం దాతల సహకారంతో మరింత విస్తరిస్తోందని, ఈ దివ్య సేవలో భక్తులందరూ తమవంతు భాగస్వామ్యం అందించి 'అన్నదాత సుఖీభవ' అనే శాశ్వత ఆశీర్వాదాన్ని పొందాలని దేవస్థానం పిలుపునిచ్చింది. శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామివారి అనంత కృపాకటాక్షాలు శ్రీమతి గుత్తికొండ శ్రీలత తో పాటు సమస్త దాతలపై ఎల్లప్పుడూ ప్రసరించాలని దేవస్థానం ఆకాంక్షించింది.


## పెనుగొండలో పారిశుధ్య, అభివృద్ధి పనుల పరిశీలన



వాసవి పెనుగొండ,ఆగష్టు 7 మనం న్యూస్ : పెనుగొండ గ్రామ ప్రత్యేక అధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పశ్చిమ గోదావరి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ అప్పారావు శుక్రవారం గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న పారిశుధ్య, మౌలిక వసతుల అభివృద్ధి పనులను పరిశీలించారు.ముందుగా గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించిన ఆయన, అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులను తనిఖీ చేశారు. అలాగే భాష్యం స్కూల్ పరిసర ప్రాంతంలో జరుగుతున్న మంచినీటి పైపులైన్ల విస్తరణ పనులను పరిశీలించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, పంచాయతీరాజ్ ఏఈ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గం ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన మా ముఖ్యమంత్రి కి ఋణపడి ఉంటా..

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- వైసీపీ మంత్రి ఉషా శ్రీ ఇక్కడి రైతులను పట్టించుకోలేదు
- గ్రామీణ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**కళ్యాణదుర్గం ఆగస్టు 7 మనం న్యూస్ :** విద్యార్థుల భవిష్యత్తుకు తోడుగా ఉండి విద్యకు ప్రాధాన్యత కల్పించి వారికి మరింత ప్రోత్సాహం అందించడం కోసం సరైన రవాణా సౌకర్యం లేక పాఠశాలలకు నడుచుకుంటూ వెళ్తున్న గ్రామీణ ప్రాంతాల 9,10 తరగతి, ఇంటర్ విద్యార్థులకు కానుకగా సైకిళ్లు అందిస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి మధ్యాహ్న భోజనం పేరును కూడా జగన్ పేరుపేట్టుకుని, చివరికి గుడ్లు, గరిట, జగ్గుపై బొమ్మలు వేయించుకోవడమే కాకుండా పిల్లలకు ఇచ్చే బ్యాగు, పుస్తకాలు, బెల్టు, టై పై కూడా బొమ్మలు వేసుకుని రాజకీయం చేసాడని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు శుక్రవారం గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహక కానుకగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అందిస్తున్న సైకిళ్ల పంపిణీని కళ్యాణదుర్గం మండలం తూర్పు కోడిపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా టీడీపీ మండల, స్థానిక నాయకులు ఎమ్ ఈ ఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంతో కలసి పాల్గొని సైకిళ్లు విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తును అత్యుత్తమంగా తీర్చిదిద్దడం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అందులో భాగంగానే కార్పొరేట్ స్థాయిలో మౌళిక వసతులు కల్పించి అదే తరహాలో స్కూల్ యూనిఫామ్ దగ్గర నుంచి షూష్, బెల్ట్, బ్యాగ్, పుస్తకాలు అందించి, నాణ్యమైన సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తూ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారని, రాష్ట్రానికి భోగాపురం ఒక వైభవని నేడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారి చేతుల మీదుగా ప్రారంభం అవడం మన రాష్ట్రానికి గర్వకారణమని, అందరికి అమ్మవడి అని చెప్పి తీరా అందించే సమయానికి ఒక్క ఇంట్లో ఒక్కరికే ఇచ్చి వారి చదువులను తుంగలో తొక్కాడన్నారు.కేవలం అమ్మవడి పథకం ద్వారా కేవలం 5500 కోట్లు అందించారని,కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తల్లిదండ్రుల బాధలు తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంట్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు ఎంతమంది ఉంటే అందరికి తల్లికివందనం అందిస్తామని హామీ ఇచ్చి నేడు 10,190 కోట్లు కేటాయించి ప్రతి తల్లి ఖాతాకు జమ చేసి నిబద్ధత చాటుకున్నారని అందులో కూడా చాలీ చాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న 30,000 మంది అంగన్వాడీ ఉపాధ్యాయులకు అందించి కూటమి ప్రభుత్వం గొప్ప మనసు చాటుకుందని తెలిపారు..అంతే కాకుండా గతంలో విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసి ఉపాధ్యాయులను బ్రాంది షాపుల వద్ద ఉంచారని అన్నారు..ఎన్నికల ముందు గ్రామాలకు వెళ్లిన సందర్భంలో చాలా చోట్ల విద్యార్థులు పుస్తకాల బ్యాగులు మోసుకుని నడుచుకుంటూ రావడం చుసి బాధ కలిగి అనాడే అనుకున్నా విద్యార్థులకు ఏదో ఒక రాకంగా వారి ఇబ్బందులు తొలగించాలని నిర్ణయించుకున్నానని నేడు వారికి సైకిళ్లు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు..ప్రతి విద్యార్థి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, వారికి అనవసరపు పనులకు కేటాయించకుండా చదువుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించి వారి బంగారు భవిష్యత్తుకు బాసటగా నిలవాలన్నారు.మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దేశ విదేశాలు తిరిగి లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని, మన ప్రాంతంలో ఎంతో మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల వెళుతున్నారని, తిమ్మసముద్రం ప్రాంతంలో ఇప్పటికే ఉన్న 1200 ఎకరాలను మరో 3000 ఎకరాలు భూమి తీసుకుని రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేయబోతున్నారని తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని అంతే కాకుండా ఈ ప్రాంథంలో భూములు ధరలు పెరుగుతాయన్నారు.

## నేతన్నకు అండగా కూటమి.. వైసీపీ హయాంలో చేనేత నిర్లక్ష్యమైంది: టీడీపీ

- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ధర్మవరంలో ఘనంగా వేడుకలు



**ధర్మవరం, ఆగస్టు 7, మనం న్యూస్:** రాష్ట్రంలో చేనేత వృత్తిదారులకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ధర్మవరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ధర్మవరం పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కదిరి గేట్ సమీపంలోని చేనేత విగ్రహానికి, అనంతరం గాంధీనగర్ సర్కిల్లోని మహాత్మా గాంధీ విగ్రహానికి, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న చేనేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేనేత సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ధర్మవరంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు ద్వారా సుమారు 10 వేల మంది చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణ, ఆధునిక పనిముట్లు సబ్సిడీపై అందించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు నెలకు రూ.4 వేల పెన్షన్, 62,541 చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, 10,032 మరమగ్గాల కుటుంబాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన 'నేతన్నల సేవలో' పథకం కింద 71,536 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.179 కోట్లు విడుదల చేయడం చేనేత కుటుంబాలకు పెద్ద ఊరటనిచ్చిందన్నారు. అదేవిధంగా 109 చేనేత సహకార సంఘాలకు రూ.79 కోట్ల క్రెడిట్ సౌకర్యం, హ్యాండ్లూమ్ పార్కులు, చేనేత మ్యూజియంలు, టెక్స్టైల్ రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేనేత వృత్తిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, నేతన్నల సమస్యలను పట్టించుకోకుండా వేలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లే పరిస్థితి కల్పించారని ఆరోపించారు. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత మాత్రమే చేనేతపై ప్రేమ చూపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఆశించిన స్థాయిలో లేవని, కూటమి ప్రభుత్వం మాత్రం ఆచరణాత్మక పథకాలతో నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు.చేనేత వృత్తిని మరింత బలోపేతం చేసేందుకు భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కమతం కాటమయ్య పరిశే సుధాకర్, పురుషోత్తం గౌడ్ భీమనేని ప్రసాద్ నాయుడు, మాధవరెడ్డి,సనత్, రాంపురం శీనా, రవి, ఫణి కుమార్,చేనేత కార్మికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్కు దూరంగా ఉండండి.. సమాజాన్ని చైతన్యపరచండి..!

- యువత లక్ష్యం దేశసేవ కావాలి.. క్రమశిక్షణ, కఠోర శ్రమే విజయానికి బాట
- ఎన్డీపీఎస్ చట్టంపై అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



**పుట్టపర్తి ఆగస్టు 7 మనం న్యూస్:** మాదకద్రవ్యాలు వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని సైతం నాశనం చేసే ప్రమాదకరమైన సామాజిక దురాచారమని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, అన్నారు. యువత డ్రగ్స్కు పూర్తిగా దూరంగా ఉండటంతో పాటు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలో అవగాహన కల్పించే బాధ్యతను కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలపై పోలీస్ శాఖ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కదిరి పరిధిలోని కుటాగుళ్లలో ఓబులేశ్వర అకాడమీలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణ కోసం అమల్లో ఉన్న నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టాన్సెస్ చట్టం-1985పై కీలక విషయాలను వివరించారు.మాదకద్రవ్యాలను స్మాల్, ఇంటర్మీడియట్, కమర్షియల్ క్వాంటిటీలుగా వర్గీకరిస్తారని ఎస్పీ తెలిపారు. గంజాయి విషయంలో ఒక కిలోలోపు స్మాల్ క్వాంటిటీ, ఒకటి నుంచి 20 కిలోలలోపు ఇంటర్మీడియట్ క్వాంటిటీ, 20 కిలోలకు పైగా కమర్షియల్ క్వాంటిటీగా పరిగణిస్తారని వివరించారు. ఇంటర్మీడియట్ క్వాంటిటీ కేసుల్లో గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు, కమర్షియల్ క్వాంటిటీ కేసుల్లో 10 నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని యువతకు చట్టపరమైన అవగాహన కల్పించారు.అల్లూరి సీతారామరాజు జిల్లాలో విధులు నిర్వహించిన సమయంలో గంజాయి సాగు, అక్రమ రవాణాపై అనేక చర్యలు చేపట్టిన అనుభవంతో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రత్యక్షంగా చూశానని ఎస్పీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే యువత భవిష్యత్తుతో పాటు కుటుంబ గౌరవం, సామాజిక జీవితం కూడా ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. లక్ష్యసాధన కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థులు డ్రగ్స్కు దూరంగా ఉండటంతో పాటు, వాటి నియంత్రణకు సంబంధించిన చట్టాలపై కూడా పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని, క్రమశిక్షణతో జీవించాలని, కఠోరంగా శ్రమించాలని, దేశసేవను ధ్యేయంగా పెట్టుకోవాలని ఎస్పీ యువతకు దిశానిర్దేశం చేశారు. తాము డ్రగ్స్కు దూరంగా ఉండటమే కాకుండా, తమ కుటుంబాలు, స్నేహితులు, పరిచయస్తులు కూడా మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమ ప్రారంభంలో గరల్స్ కమాండోలు అందించిన గార్డ్ ఆఫ్ ఆనర్ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన డ్రిల్ ఫార్మేషన్స్ను ప్రశంసించారు. ఆర్మీ శిక్షకుల మార్గదర్శకత్వంలో సుమారు 20 నిమిషాల పాటు ఎలాంటి పొరపాట్లు లేకుండా క్రమశిక్షణతో ప్రదర్శన ఇవ్వడం అభినందనీయమన్నారు. దేశంలోని ఎలైట్ భద్రతా దళాలు, విదేశీ శిక్షణా విధానాలను పరిశీలించిన అనుభవంతో ఈ ప్రదర్శనలు అత్యున్నత ప్రమాణాలకు దగ్గరగా ఉన్నాయని కొనియాడారు. ప్రతి కదలిక సహజంగా మారేంత వరకు నిరంతర సాధన చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్యంగా విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించడంలో ఓబులేశ్వర అకాడమీ చేస్తున్న కృషిని అభినందించారు. యూనిఫాం ధరించడం కేవలం ఉద్యోగం కాదని.. దేశానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని ఎస్పీ అన్నారు. పోలీస్ శాఖ, సైన్యం, కేంద్ర సాయుధ దళాల్లో సేవ చేసే అవకాశం కష్టపడి సాధించుకున్న గౌరవమని పేర్కొన్నారు. తన కుటుంబంలో యూనిఫాం ఉద్యోగాలపై పెద్దగా అవగాహన లేకపోయినా, ఐపీఎస్గా ఎంపికై యూనిఫాం ధరించిన తర్వాత దేశసేవ విలువను మరింతగా తెలుసుకున్నానని విద్యార్థులతో తన అనుభవాన్ని పంచుకున్నారు. డగ్స్కు దూరంగా ఉండటమే కాదు.. మాదకద్రవ్యాలపై సమాజాన్ని చైతన్యపరచడం కూడా ప్రతి యువకుడి బాధ్యత. మీ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని క్రమశిక్షణ, కఠోర శ్రమ, దేశసేవతో ముందుకు సాగండి అని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివ నారాయణస్వామి, సీఐలు వెంకటేశ్వర్లు, నిరంజన్ రెడ్డి, నాగేంద్ర, ఎస్త్స బాబ్జాన్, అకాడమీ ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు

## ఉరుకుందలో రైతన్న మీ కోసం




**కౌతాళం, ఆగష్టు 07 మనం న్యూస్:** రైతన్న మీకోసం కార్యక్రమం కింద ఎల్ నీ నో యొక్క ఎఫెక్ట్ని సమర్థవంతంగా ఎదుర్కొనడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఉరుకుంద గ్రామంలో ప్రారంభించడం జరిగింది.ఇందులో భాగంగా జిల్లా నుంచి శ్రీనివాసులు నాయక్ ఏడి ఎనిమల్ హస్బెండ్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ప్రణీత ఆర్ఎస్కె అసిస్టెంట్ ఊరుకుంద మరియు వెటర్నరీ అసిస్టెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో ప్రతి రైతును కలుసుకొని వారి యొక్క పంట సమగ్రతను వేసినా పంట యొక్క ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని తదుపరి పిఎండిఎస్ కార్యక్రమము సురేష్ కుమార్ పొలంలో వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శేషాద్రి మరియు అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులు పాల్గొనడం జరిగింది.

## వాతావరణ సానుకూల పంటలను సాగుచేసుకోవాలి

**మహానంది, ఆగస్టు6,మనంన్యూస్:** మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎల్ నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళికపై ఏఓ సుబ్బారెడ్డి బుక్కాపురం లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ ఖరీఫ్ సీజన్లో రైతుల కమతాలను సందర్శించి వాతావరణ సానుకూల పంటల ప్రణాళిక ఏర్పాటు చేసుకొని, ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించి ఆదాయ భద్రతను కాపాడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమము ఈరోజు నుండి ఖరీఫ్ కాలం పూర్తి అయ్యేంతవరకు జరుగుతుందని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, సత్యనారాయణమ్మ, గ్రామ ఉద్యాన అధికారి సుభాష్ చంద్ర బోస్, ఎంపీఈవోలు రేవతి, మాధవి లత మరియు రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**కదిరి రూరల్ డిసెంబర్ 7 మనం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కదిరి నియోజవర్గంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ మౌర్య భరద్వాజ్ , ఆర్డీవో కళావతి , నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజా దర్బార్కు అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు, అధికారులకు అందజేశారు. ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలించి, అర్హత మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశించారు.

# అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలి

- వన్ మంత్ - ఫోర్ విజిట్ లో భాగంగా ఉదిరిపికొండలో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్
- ప్రత్యేక పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం



**కూడేరు , ఆగస్టు 07: మనం న్యూస్ :** అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం కూడేరు మండలం లోని కుదిరిపికొండ గ్రామంలో శుక్రవారం ఉదయం అనంతపురం ఆర్ డి ఓ ప్రేమత కుమార్ తో కలిసి 'వన్ మంత్ - ఫోర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కారవేదికకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలతో పాటు, ప్రతి నెల ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి అక్కడ వరుసగా నాలుగు వారాల పాటు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున అధికారులు ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తీసుకుంటున్న చర్యలను నేరుగా ప్రజలకు తెలియజేయాలని స్పష్టం చేశారు. అర్జీలు సమర్పించిన వారికి తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. ఇళ్లు, స్థలాలు, పెన్షన్లు, రెవెన్యూ అంశాలు, భూమి వివాదాలు సహా ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. నెలలో వచ్చే నాలుగు వారాల్లో ఒక్కో మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామనిజిల్లా తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో పరిష్కరించగల అంశాలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా తమ సమస్యలను అధికారులకు వివరించి, ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశించారు. కోర్టు కేసులు మినహాయించి మొత్తం 219 ఫిర్యాదులు రాగా ఇందులో 139 వరకు పరిష్కరించబడినవని 80 వరకు వివిధ కారణాలవల్ల తిరస్కరించ బడినవని ఇంకనూ 58 దాకా ఉన్న ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూడేరు తాసిల్దార్ మోహన్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో జిలాన్ భాష, సిడిపిఓ శ్రీదేవి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సురేఖ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఏఈ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ రమణయ్య, ఏపీవో పోలేరయ్య, స్థానిక నాయకులు మహేష్ జల్లిపల్లి చంద్ర,గ్రామ ప్రజలు అర్జీదారులుతదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ' అంటూ వైఎస్సార్సీపీ నిరసన

- డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్.. మంత్రి లోకేష్ రాజీనామా చేయాలంటూ నినాదాలు



**ధర్మవరం, ఆగస్టు 7, మనం న్యూస్:** ఇటీవల నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్మవరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ జెన్-జెడ్ వార్ రిలే కార్యక్రమం రెండో రోజు భాగంగా చేపట్టిన ఈ ఆందోళనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ సోషల్ మీడియా మాజీ పట్టణ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో 'మెగా డీఎస్సీ' పేరుతో నిరుద్యోగ యువతకు హామీలు ఇచ్చిన ప్రభుత్వం, చివరకు వారి ఆశలను వమ్ము చేసిందని విమర్శించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలు రావడం వల్ల నిజాయితీగా పరీక్షలు రాసిన అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. టీచర్ ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా సిద్ధమవుతూ టెట్, బీఈడ్ పూర్తి చేసిన వేలాది మంది నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన అన్నారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, నిజాయితీగా పరీక్ష రాసిన అభ్యర్థులకు న్యాయం చేయాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేయడంతో పాటు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని వైఎస్సార్సీపీ నాయకులు డిమాండ్ చేశారు. 'మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ', 'విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపాలి', 'డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి', 'లోకేష్ రాజీనామా చేయాలి' అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గంగాధర్, పట్టణ అధ్యక్షుడు వేణు, సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షుడు చిరువర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జక్కా భార్గవ, మాజీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, చెన్నారెడ్డి, దివాకర్ నాయక్, దాసరి శివ, మహమ్మద్ రఫీ, సిద్ధిక్, హరి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్, మాజీ కౌన్సిలర్లు రమాదేవి, చందాబాషా, అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట



**కదిరి రూరల్ ఆగస్టు 7 మనం న్యూస్:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కదిరి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు అమీన్ నగర్లో శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇంటి ఇంటికి తెలుగుదేశం డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకురావడంతో పాటు ప్రతి గ్రామం, ప్రతి వార్డు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా తాము నిరంతరం పనిచేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ 6వ వార్డు ఇన్చార్జి చైతన్య, మహబూబ్, శేషు, చల్లా శ్రీనివాసులు, పిచ్చిలి శంకర్, ఖాసిం వలి, విశ్వనాథ్, ప్రవీణ్, రత్తమ్మ, గంగారత్నమ్మ, ఉమాదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సెన్సస్ హ్యాండ్ బుక్ త్వరగా పూర్తి చేయండి

- జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా సెన్సస్ నోడల్ అధికారి మలోలా



**అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 07: మనం న్యూస్ :** 2027 జనాభా గణనలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్బుక్ (డిస్ట్రిక్ట్ సెంసుస్ హ్యాండ్బుక్ - ( డి సి హెచ్ బి ) తయారీకి సంబంధించి నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను జిల్లా రెవెన్యూ అధికారి మరియు జిల్లా సెన్సస్ నోడల్ అధికారి మలోలా ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. శుక్రవారం అనంతపురంలోని ఆరట్స్ కళాశాల, బుక్కరాయసముద్రం మండల పరిషత్ కార్యాలయం, రాప్తాడు మండలం సచివాలయం-2లో జరుగుతున్న శిక్షణా కేంద్రాలను సందర్శించి శిక్షణ నిర్వహణ, పాల్గొంటున్న ఫీల్ ఫంక్షనరీలకు అందిస్తున్న మార్గదర్శకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ, మండల స్థాయిలో నియమించబడిన పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామ రెవెన్యూ అధికారులు జిల్లా సెన్సస్ హ్యాండ్బుక్ తయారీలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామం, పట్టణానికి సంబంధించిన సమాచారాన్ని డీసీహెచ్బీ ( డిసిహెచ్బి ) మొబైల్ యాప్లో కచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే, 17-08-2026 నుండి 15-09-2026 వరకు ఫీల్ ఫంక్షనరీలుగా నియమించబడిన పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామ రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని రెవెన్యూ గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన జిల్లా సెన్సస్ హ్యాండ్బుక్ క్షేత్రస్థాయి సమాచార సేకరణను చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి ఆదేశాల మేరకు జిల్లా సెన్సస్ హ్యాండ్బుక్ తయారీకి సంబంధించిన అన్ని కార్యక్రమాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు.



## రణబీర్ కపూర్ నా ఆల్‌టైమ్ ఫేవరెట్ నటుడు : అదితి రావు హైదరి

విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ అలరిస్తున్న అదితి రావు హైదరీ, ఇటీవల 'గాంధీ టాక్స్' చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం ఆమె ప్రైమ్ వీడియో వేదికగా రాబోతున్న సరికొత్త ప్రాజెక్ట్ 'వెల్కమ్ టు ఖోయా మహల్' అనే వెబ్ సిరీస్ తో అలరించేందుకు సిద్ధమయ్యారు. కొంకణా సేన్ శర్మ, జైదీప్ సర్కార్ సంయుక్తంగా సృష్టించిన ఈ థ్రిల్లర్ సిరీస్ లో వర్సటైల్ యాక్టర్ బరుణ్ సోబ్తి కూడా ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సిరీస్ కథాంశం ఎంతో ఆసక్తికరంగా రూపుదిద్దుకుంటోంది. పూర్వపు రాజకుటుంబానికి చెందిన అక్కాతమ్ముళ్ళు, తమకు వారసత్వంగా వచ్చిన శిథిలావస్థలో ఉన్న ఖోయా మహల్ అనే హెరిటేజ్ హోటల్ ను నడపడానికి ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు అనే కథతో ఇది సాగుతుందని టాక్. సరికొత్త ప్రయాణంతో ప్రేక్షకుల ముందుకు రానున్న అదితి రావు హైదరీ, ఈ సిరీస్ తో మరోసారి తన మార్క్ నటనతో మెప్పించనున్నారని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అదితి తోటి నటుడు రణబీర్ కపూర్ నటనా ప్రతిభను పొగుడుతూ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దర్శకుడు ఇంతియాజ్ అలీ తెరకెక్కించిన ఐకానిక్ చిత్రం 'రాక్ స్టార్'లో రణబీర్ తో కలిసి స్క్రీన్ స్పేస్ షేర్ చేసుకున్న క్షణాలను ఆమె గుర్తు చేసుకున్నారు. రణబీర్ ను ఇండస్ట్రీలోని అత్యుత్తమ నటుల్లో ఒకరిగా పోల్చారు. రణబీర్ కపూర్ తో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ అదితి రావు హైదరీ మాట్లాడుతూ.. 'రణబీర్ తో కలిసి నటించడం ఒక క్రేజీ అండ్ మైండ్ బ్లోయింగ్ ఎక్స్ పీరియన్స్. ఆయన నిజంగా ఒక ఇన్ క్రెడిబుల్ యాక్టర్. నా ఆల్ టైమ్ ఫేవరెట్ నటుల్లో రణబీర్ కపూర్ ఒకరు. కెమెరా ముందుకు రాగానే సన్నివేశంలో పూర్తిగా జీవించేయడం ఆయన ప్రత్యేకత. ఆయన తన నటనతో ఎవరినైనా చాలా సులభంగా మైమరిపించి మెప్పించగలడు' అని అదితి ప్రశంసించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వ్యాఖ్యలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

# వార్మప్ మ్యాచ్.. ప్రభావం చూపించని భారత బౌలర్లు

శ్రీలంక గీఐతో వార్మప్ మ్యాచ్ లో భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. తొలి రోజు ఆట ముగిసే సరికి శ్రీలంక గీఐ ఎనిమిది వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. క్రీజ్ లో కేషర నువాంత (9*), దిలుమ్ సుదీరా (1*) ఉన్నారు. నిషాన్ మదుష్క (66), రవిందు రసాంత (71), సోనాల్ దినుష (51) అర్ధశతకాలతో అలరించారు. పవన్ రత్నాయకే (39), విక్రమసింఘె (31), పసిందు సూరియబండారా (35) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 2, కుల్దీప్ యాదవ్ 2, మానవ్ సుతార్ 2, గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ తీశారు.

**ఆ ఇద్దరికీ దక్కని వికెట్లు**

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన శ్రీలంక గీఐజట్టుకు ఓపెనర్లు నిషాన్, రవిందు మంచి ఆరంభం ఇచ్చారు. తొలి వికెట్ కు 110 పరుగులు జోడించారు. భారత పేస్ బౌలర్లు సిరాజ్, ప్రసిద్ధ్ కు వికెట్ దక్కలేదు. వీరిద్దరూ 21 ఓవర్లు వేసి 76 పరుగులు ఇచ్చారు. బుమ్రా లేకుండానే శ్రీలంకతో టెస్టు సిరీస్ ను ఆడనుంది. ఈ క్రమంలో వికెట్ లేకపోవడం భారత శిబిరంలో కాస్త ఆందోళన కలిగించేదే. కొత్త బౌలర్ సారాంశ్ జైన్ (11-0-54-0) కూడా ఇబ్బంది పడ్డాడు. అయితే, కుల్ దీప్ తోపాటు జడేజా, సుతార్ నాణ్యమైన బౌలింగ్ తో వికెట్లు దక్కాయి.

**గిల్ గైర్హాజరు..**

వార్మప్ మ్యాచ్ తొలి రోజు ఆటకు భారత కెప్టెన్ శుభ్ మన్ గిల్ దూరంగా ఉన్నాడు. గురువారం ప్రాక్టీస్ చేస్తుండగా చేతి వేలికి గాయమైన సంగతి తెలిసిందే. దీంతో అతడికి బదులు కేఎల్ రాహుల్ సారథ్యం నిర్వర్తించాడు. రెండో రోజు గిల్ ఫిట్ గా ఉంటే బరిలోకి దిగే అవకాశం ఉంది. అదీ సాధ్యం కాకపోతే.. నేరుగా ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో జరగనున్న తొలి టెస్టులోనే ఆడతాడు.




# అంతర్జాతీయ వేదికపై గురుకుల కెరటాలు!

- మలేషియాలో జరిగే సౌత్ ఈస్ట్ కోస్ట్ లాక్రోస్ ఛాంపియన్షిప్నకు తెలంగాణ విద్యార్థినులు
- గోపిక, సంగీతలను అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, వి. హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 7 (మనం న్యూస్):** తెలంగాణ బీసీ గురుకుల విద్యార్థినులు అంతర్జాతీయ క్రీడా యవనికపై దేశ ఖ్యాతిని చాటేందుకు సిద్ధమయ్యారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'సౌత్ ఈస్ట్ కోస్ట్ లాక్రోస్ ఛాంపియన్‌షిప్ - 2026' పోటీలకు రాష్ట్రానికి చెందిన ఇద్దరు గురుకుల క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఈ పోటీలు జరగనున్నాయి. బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థినులు పి. గోపిక, సంగీత ఈ మెగా టోర్నీలో భారత్ తరఫున బరిలోకి దిగనున్నట్లు సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

**పట్టుదలతో పైపైకిః**

చిన్న వయసులోనే గురుకులాల బాట పట్టిన ఈ గ్రామీణ ప్రతిభామూర్తులు నేడు అంతర్జాతీయ స్థాయికి ఎదగడం విశేషం. ఐదో తరగతిలోనే బీసీ గురుకుల పాఠశాలలో అడుగుపెట్టిన గోపిక, సంగీత చదువుతో పాటు క్రీడల్లోనూ అసాధారణ పట్టుదలను కనబరిచారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో లాక్రోస్ క్రీడలో రాణిస్తూ ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్నారు. గతంలో కర్నూలు, చెన్నైలలో జరిగిన సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్‌లలో అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాలను కైవసం చేసుకున్న వీరు.. ఆ తర్వాత ఆగ్రా, జమ్ముకాశ్మీర్‌లలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ అత్యున్నత ప్రతిభ కనబరిచి అందరి దృష్టిని ఆకర్షించారు. జాతీయ స్థాయిలో చూపిన ఇదే జోరుతో ఇప్పుడు మలేషియాలో జరిగే అంతర్జాతీయ టోర్నీకి అర్హత సాధించి సత్తా చాటారు.



ప్రపంచంలోని అత్యుత్తమ క్రీడాకారులతో పోటీపడి, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ, తెలంగాణ రాష్ట్ర ఉనికిని చాటిచెప్పేందుకు మన గురుకుల విద్యార్థులకు ఇదొక అద్భుతమైన అవకాశమని ఈ సందర్భంగా కార్యదర్శి సైదులు కొనియాడారు.

**మంత్రి పొన్నం అభినందనలుః**

అంతర్జాతీయ పోటీలకు ఎంపికై రాష్ట్ర కీర్తిని దశదిశలా చాటిన విద్యార్థినులు గోపిక, సంగీతలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, కార్యదర్శి బడుగు సైదులులు క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. విద్యార్థినుల అసాధారణ ప్రతిభ వెనుక నిరంతరం కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్లు అంజలి, మమత, శోభలతో పాటు లాక్రోస్ కోచ్‌లు శివకుమార్, ఆకాష్, ప్రిన్సిపాల్ శ్రీలతలను ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రేక్షకులు నా కోసం ఖర్చు పెట్టే డబ్బులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తాను

## - దొర సాయి తేజ



**వర్టికల్ స్టోరీస్‌లో చాయ్ షాట్స్ నుంచి వచ్చిన 'దందా' సిరీస్‌తో హీరోగా దొర సాయి తేజ ఓ ట్రెండ్ క్రియేట్ చేశారు. దర్శకుడు ఆదిత్య దేవులపల్లి తెరకెక్కించిన ఈ సిరీస్ యూ ట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ సిరీస్ సక్సెస్ ఫుల్‌గా సాగుతున్న తరుణంలో హీరో దొరసాయి తేజ తన జర్నీ గురించి 'మనం' ఇంటర్వ్యూలో పలు ఆసక్తి కర అంశాలను తెలియజేశారు. విశేషాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతుల గురించి చదివేద్దాం..**

**మీ సినీ జర్నీ గురించి చెప్పండి?**

ప్రభాస్ 'అడవి రాముడు' సినిమాలో హీరో చిన్నప్పటి చైల్డ్ కారెక్టర్‌కి డబ్బింగ్ చెప్పాను. 'కొత్త_బంగారులోకం', 'హై స్కూల్' అనే సిరీస్‌లో నటించాను. 'అలా మొదలైంది' సినిమాలోనూ ఓ చిన్న పాత్రను పోషించాను. 2016 నుంచి ఆర్జీవీతో అనుబంధం ఏర్పడింది. 'శ్రీదేవీ' అనే ఓ విడుదల కాని సినిమాలో నటించాను. అక్కడే నాకు సినిమా పరిచయమైంది. అలా 2018లో యూ ట్యూబ్ జర్నీ సీరియస్‌గా ప్రారంభమైంది. 'బ్యాక్ బెంచర్స్' సిరీస్‌తో మంచి గుర్తింపు వచ్చింది. అలా సిరీస్‌లు చేసుకుంటూ వచ్చాను. గత ఏడాది సొంతంగా కంటెంట్ క్రియేషన్ కంపెనీ ప్రారంభించాను. రీసెంట్‌గా మళ్లీ 'దందా'తో సక్సెస్ వచ్చింది.

**ఇంత చిన్న వయసులోనే వ్యాపారస్థుడిగా, నటుడిగా, కంటెంట్ క్రియేటర్‌గా విజయం సాధించడం పట్ల మీరు ఎలా ఫీలవుతున్నారు?**

నేను నిద్ర లేచిన క్షణం నుంచి కంటెంట్ క్రియేటర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా ఆలోచిస్తూనే ఉంటాను. నన్ను నేను కొత్తగా పరిచయం చేసుకోడానికి ఇదొక మార్గం. అందుకే అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నాను. కంటెంట్ క్రియేషన్ అనేది నా బిజినెస్. సినిమా అనేది నా ప్యాషన్. రెండూ కలిపితే దొర సాయి తేజ.

**మీకు పార్టీలు చేసుకోవాలని, ఎంజాయ్ చేయాలని అనిపించదా?**

ప్రతీ విషయాన్ని నేనే నేర్చుకోవాలి. నాకు నేనుగానే అన్నీ నేర్చుకుంటున్నాను. కింద పడ్డ ప్రతి సారీ ఒక కొత్త గుణపాఠం నేర్చుకుంటాను. నేను ఎప్పుడూ నా వయసు కంటే ఓ ఐదేళ్లు పెద్దవాడిలానే ఆలోచిస్తా. రోజంతా వృత్తి పరమైన పనులతోనే బిజీగా ఉంటాను. ఇతర పనులకు నాకు టైం ఉండదు. ప్రతీ రోజూ ఏదో ఒకటి కొత్తగా క్రియేట్ చేయాలని ఆలోచిస్తుంటాను.

**సోషల్ మీడియాలో వచ్చే ప్రశంసలు, విమర్శల్ని ఎలా తీసుకుంటారు?**

సోషల్ మీడియాలో అన్నీ ఉంటాయి. ప్రతీ వీడియోకి కొన్ని కొత్త ప్రశంసలు, కొన్ని తిట్లు వస్తుంటాయి. ఈ కంటెంట్ క్రియేషన్ అనే దాన్ని నేను ఒక బ్రిడ్జ్‌లా వాడతాను. ఇక్కడ నా కోసం ఉండే ఫాలోయింగ్‌ని సినిమా థియేటర్ వరకు తీసుకు రావాలని అనుకుంటున్నాను. అయితే కంటెంట్ క్రియేషన్స్‌లోనే మా రోజువారి ఖర్చులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇన్‌ఫ్లూయెన్సర్, కంటెంట్ క్రియేటర్ అనే మాట కంటే.. నటుడు అని పిలిపించుకోవాలని నాకు ఉంటుంది.

**సోషల్ మీడియా లైఫ్, ఈ క్రియేటర్ స్పేస్ గురించి కొత్తగా వచ్చేవాళ్లకు మీరిచ్చే సలహా ఏంటి?**

కొద్దిగా ఫాలోవర్లు లైకులు షేర్లు కనిపించాయంటే చాలు, చూసే జనాలంతా అబ్బా 'లైఫ్ అంటే వీడిది రా' అనుకుంటారు. కానీ అది నిజం కాదు, వైకుంఠపాళీ లాగా నిచ్చెనెక్కిచ్చేది అదే, ఏదైనా తేడా కొడితే కింద పడేసేది అదే. చూడటానికి అందంగా ఫ్యాన్సీగా కనిపిస్తుంది, వ్యూస్ రీచ్ కోసం ఒకటి చెప్తే ఇంకో టైటిల్ పెట్టి, తంబ్‌నెయిల్ మార్ఫ్ చేసి వాళ్ళ ప్రయోజనాల కోసం జీవితాలు నాశనం చేసే వాళ్ళూ ఉన్నారు. సో దీంట్లోకి రావాలనుకునే వాళ్ళు ఎవరైనా సరే ప్రశంసకీ విమర్శకీ రెండింటికి సిద్ధంగా ఉండాలి. అలా అయితేనే ఈ స్పేస్‌లో సర్వైవ్ అవ్వగలరు.

**అరవింద్ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. మిమ్మల్ని విమర్శించే వారు కూడా పొగిడేస్తున్నారు కదా?**

కంటెంట్ క్రియేషన్స్‌లో ఒకే రకమైన పాత్రను పోషించగలను. కానీ సిరీస్, సినిమా వరకు వచ్చే సరికి రకరకాల పాత్రలను పోషించే అవకాశం వస్తుంది. నేను 'దందా'లో అరవింద్‌గా మాత్రమే కనిపిస్తాను. ఇలాంటి ఛాలెంజింగ్ పాత్రలే రావాలని ఇన్నాళ్లు కోరుకున్నాను. ఇదంతా మా దర్శకుడి వల్లే సాధ్యమైంది.

**దర్శకుడు ఆదిత్య దేవులపల్లి మీ గురించి ఎంతో గొప్పగా చెప్పారు?.. మీరు నిజంగానే సింగిల్ టేక్ ఆర్టిస్టా?**

నాకు మానిటర్ చూసే అలవాటు ఉండదు. కెమెరామెన్‌ని చూస్తేనే విషయం తెలుస్తుంది. ఫస్ట్ టేక్‌లోనే సీన్‌ను పూర్తి చేయాలని అనుకుంటాను. అందుకే ఒక సీన్ ఉంటే.. దానికి ముందు, తర్వాత సీన్లు ఏంటన్నది కూడా చూసుకుంటాను. అందుకే దాదాపు అన్నీ కూడా సింగిల్ టేక్‌లోనే చేసేస్తాను. టేక్స్ ఎక్కువ అయితే ప్రొడక్షన్ కాస్ట్ కూడా పెరుగుతుంది. సెట్‌లో ఉన్నంత సేపు నేను అరవింద్ పాత్రలో జీవిస్తాను. అందుకే సింగిల్ టేక్‌లోనే చేసేశాను.

**ప్రస్తుతం ఉన్న మార్కెటింగ్ స్ట్రాటజీపై మీ అభిప్రాయం ఏంటి?**

కంటెంట్ ఎంత బాగున్నా.. మన దగ్గర ఉన్న కంటెంట్ గురించి జనాలకు చెప్పే మార్కెటింగ్ స్ట్రాటజీ లేకపోతే వృథానే. అందుకే ఇప్పుడు ప్రమోషన్స్, మార్కెటింగ్ అనేది ఎంతో ముఖ్యంగా మారాయి. 'దందా' కోసం నేను కూడా డిఫరెంట్‌గా ప్రమోట్ చేయాలని అనుకున్నాను. అందుకే నా రూ. 15 లక్షలు పోయాయి అని మా సిరీస్ కంటెంట్ అర్థమయ్యేలా ఓ ప్రమోషనల్ వీడియో చేశాం. అది అర్థమైంది కాబట్టి.. మా 'దందా'ని ఆడియెన్స్ బిగ్గెస్ట్ హిట్ చేశారు.

**సోషల్ మీడియాలో మీకోసం నిలబడే మీ ఫ్యాన్స్ గురించి చెప్పండి?**

ఇదంతా ఒక్క రోజులో సంపాదించింది కాదు. నేను చేసిన కంటెంట్‌లో వాళ్లని వాళ్లు చూసుకున్నారు. అలా చూసుకుని కనెక్ట్ అయ్యారు. ఇదంతా జరగడానికి కొన్ని ఏళ్లు పడుతుంది. సోషల్ మీడియాలో పాజిటివిటీతో పాటుగా నెగెటివిటీ ఉంటుంది. మాట్లాడేవాళ్లు మాట్లాడుతూనే ఉంటారు. నిజం ఏంటన్నది నాకు తెలుసు. అందుకే నేను ఏమీ పట్టించుకోకుండా ముందుకు వెళ్తుంటాను.

**సోషల్ ఇన్‌ఫ్లూయన్సర్స్ మీద ఎలాంటి బాధ్యత ఉంటుంది?**

మొన్న కామన్ వెల్త్ గేమ్స్‌లో సాక్షి చౌదరీ బాక్సింగ్ కేటగిరిలో గోల్డ్ మెడల్ కొట్టేరు, అది ఎంతమందికి తెలుసు? కానీ మీరు ఫాలో అయ్యే ఇన్‌ఫ్లూయన్సర్ ఏం పోస్టు పెట్టేరు ఏం ట్వీట్ చేశారు అనేది మాత్రం ఖచ్చితంగా గుర్తుంటది. సో సెలబ్రిటీస్, స్పోర్ట్స్‌మేన్ కంటే ఎక్కువ జనాలు ఇన్‌ఫ్లూయన్సర్స్‌ని అడ్మైర్ చేస్తారు, వాళ్ళ లుక్స్ అండ్ స్టైల్‌ని బాగా గమనిస్తారు. కాబట్టి ఇన్‌ఫ్లూయన్సర్ ఏం చేసినా, మాట్లాడినా, బట్టలు వేసుకున్నా సరే అది చాలామంది పై ప్రభావం చూపిస్తుంది. సో వాళ్ళు చాలా జాగ్రత్తగా నడుచుకోవాలి

**ఖాళీ టైంలో దొర సాయి తేజ ఎలా ఉంటాడు?**

నేను కూడా అందరిలో ఒకడినే. కాకపోతే నాకంటూ ఓ దారి క్రియేట్ చేసుకున్నాను. అది నా ఆర్థిక పరిస్థితుల వల్ల కావొచ్చు, చిన్నప్పటి నుంచి నాకున్న ప్యాషన్ వల్ల కావొచ్చు. ఇక ముందు నన్ను అందరూ కొత్తగా చూస్తారు. థియేటర్, ఓటీటీ, సోషల్ మీడియాలో నన్ను చూసి అందరూ గర్వపడేలా చేస్తాను. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా సరే ఆగకుండా పరిగెత్తాలి, నా లక్ష్యాన్ని సాధించాలనే ఫోకస్‌తోనే ఉంటాను.

**'దందా' టీం గురించి చెప్పండి?**

ఆదిత్య గారు వంద శాతం సక్సెస్ అయ్యారు. పేపర్ మీద రాసుకున్నది అవుట్ పుట్‌గా తీసుకు రావడం అన్నది మామూలు విషయం కాదు. ఆ విషయంలో ఆదిత్య అన్నకు ప్రశంసలు వస్తున్నాయి. 'దందా' సిరీస్‌కు సంబంధించిన ప్రతీ విషయంలో ఆయన ఎంతో కష్టపడ్డారు. ఆయన విజన్ వల్లే 'దందా' యూనిక్‌గా నిలిచింది. ఈ సిరీస్‌ను ఏడు రోజుల్లో, 30 కాల్షీట్స్‌లో పూర్తి చేశాం. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా కష్టపడి పని చేశాం. అదే 'దందా'కి హైలెట్. డైరెక్టర్, మ్యూజిక్ డైరెక్టర్, సినిమాటోగ్రాఫర్, మేం ఇలా అందరం సింక్‌లో ఉన్నాం. అందుకే 'దందా' అద్భుతంగా వచ్చింది.

**ఫ్యూచర్ ప్లానింగ్ ఏంటి?**

ప్రతీ ఒక్క సాధారణ వ్యక్తి రిలేట్ అయ్యే కథల్ని థియేటర్‌లో చూపించాలని అనుకుంటున్నాను. జీరో టు హీరో అనే పాత్రలను పోషించాలని కోరుకుంటున్నాను. అందరిలోనూ స్ఫూర్తి నింపే కథల్ని, మంచి సందేశాన్ని ఇచ్చే ప్రాజెక్ట్‌ల్ని చేయాలని అనుకుంటున్నాను. మన చుట్టూ ఉండే కథల్ని, పాత్రల్ని ఎంచుకుంటాను. ప్రేక్షకులు నా కోసం ఖర్చు పెట్టే డబ్బులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తాను.''

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.